జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 2 సంచిక - 18 పక్షపత్రిక సెప్టెంబర్16-30, 2011


## పాల సహకార సంఘాలకే స్వయం ప్రతిపత్తి

- 'సుప్రీం' తీర్పు




# మూడు యాత్రలు...

అద్వానీ రథయాత్ర



బిజెపీలో అవినీతి 'గాలి'

బాబు నిత్య యాత్ర



విశ్వసనీయతే కరువు

జగన్ ఢిల్లీ యాత్ర



దక్కని 'ఓదార్పు'



సెప్టెంబర్ 17 హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా
జెండాను ఆవిష్కరిస్తున్న జేపీ



లోక్‌సత్తా పార్టీ ఆఫీసులో హైదరాబాద్ విమోచన దినోత్సవం



బలమైన లోక్‌పాల్ కోసం తిరుపతిలో దీక్షలు

## వెల్దూరులో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు నిరసనగా విజయనగరం లో జరిగిన సభ



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2011

సంపుటి - 2 సంచిక - 18

## లోపలి పేజీల్లో...

పాల సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి ...... 5
కాగ్ అక్షింతలు-ఇరకాటంలో కేంద్ర సర్కారు........... 6
మూడు యాత్రలు-ముగ్గురు యాత్రీకులు............... 7
సంక్షోభాల నుండి పరిష్కారాలు............................. 9
నేటికీ అభివృద్ధి లేని ప్రాంతాలు ఉండడం సిగ్గుచేటు.... 10
రైతుల ధర్మాగ్రహమే "పంట విరామం".................. 13
"కందా" సిఫారసులు, రైతుకు దక్కని భరోసా........ 15
రాష్ట్రంలో భూ కేటాయింపుల కొత్త విధానం........... 16
పాఠశాల విద్యలో ప్రమాణాలు................................ 17
పట్టణ జనాభా పెరగాలి - వికృతంగా కాదు.......... 19
నిష్కళంక రాజకీయావేత్త
నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత....................................... 20
మానవ హక్కుల సార్వలౌకిక ప్రకటన...................... 22
లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక.............................. 22
జిల్లాల సమాచారం................................................ 29

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **జ్యోతి తాటి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# పాల సహకారంలో ప్రభుత్వ జోక్యం తగదు

## సంపాదకీయం


రాష్ట్రంలో 1995 మాక్స్‌చట్టం (పరస్పర సహాయ సహకార సొసైటీలు) కింద 7 పాల సహకార సంఘాల సమాఖ్యలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వ ప్రమేయం లేకుండా మాక్స్ చట్టం పరిధిలో అవి తమ కార్యకలాపాలను నిర్వహించుకుంటున్నాయి. పాల రైతులకు లీటరుకు 40-42 రూపాయలు చెల్లిస్తూ, పశువుల కొనుగోళ్ళకీ, మేతకీ అప్పులిస్తూ కూడా అవి లాభాల బాటలో నడుస్తున్నాయి.

మరోపక్క 1964 సహకార సంఘాల చట్టం కింద రాష్ట్రప్రభుత్వం కొన్ని డైరీలను నిర్వహిస్తున్నది. అది పాల రైతులకు 38-40 రూపాయలే ఇస్తున్నా నష్టాలబాటలో, మూసివేతల క్రమంలో వున్నాయి. ప్రజల సొమ్ముని బడ్జెట్‌లలో మేస్తూ కాలం గడుపుతున్నాయి. పాల రైతుల చేతుల్లో వున్న సహకార సంఘాలకీ, ప్రభుత్వం చేతుల్లో వున్న సహకార సంఘాలకీ వున్న ఈ వ్యత్యాసం ప్రభుత్వానికి తెలుసు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో పాల ఉత్పత్తిని పెంచడానికి, రైతులకు అదనపు ఆదాయం కల్పించడానికి ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా మాక్స్ సహకార సంఘాలు చూపిన మార్గాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రభుత్వరైతులను రాష్ట్ర ఫెడరేషన్‌ను వారికి అప్పగించి, రాష్ట్రంలోని అందరు రైతులకు మేలు చెయ్యడానికి చర్యలు తీసుకోవడం సముచితంగా వుండేది. కాని రాష్ట్ర ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరించింది.

లాభాల బాటలో నడుస్తూ రైతులకు హెచ్చురేట్లు ఇస్తున్న మాక్స్ సహకార సంఘాల మీద కత్తి దూసింది. 2006 మార్చి నెలలో ఈ మాక్స్ సహకార సంఘాలను ప్రభుత్వ అధీనంలోకి తెచ్చుకోడానికి ఒక ఆర్డినెన్సును జారీ చేసింది. కలెక్టర్లను స్పెషలాఫీసర్లుగా నియమించి ఈ సంఘాలను స్వాధీనం చేసుకుంది. లోక్‌సత్తా పార్టీ దీనిపై తీవ్రంగా స్పందించింది. ఇది పౌరుల సంఘాలు పెట్టుకుని, నిర్వహించుకునే స్వేచ్ఛమీద దాడిగా అభివర్ణించింది.

ప్రభుత్వ ఆర్డినెన్సును మాక్స్ సహకార సంఘాలు హైకోర్టులో సవాలు చేశాయి. ముందు స్టే తర్వాత తీర్పు ఈ సంఘాలకు అనుకూలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చాయి. అయినా ప్రభుత్వం అనాలోచితంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇప్పుడు సుప్రీం కోర్టు కూడా హైకోర్టు తీర్పును ధృవీకరించింది. 1995 మాక్స్ చట్టం సహకార స్ఫూర్తికి అనుగుణమైన చట్టంగా పేర్కొంది. దాని నుండి పాల సహకార సంఘాల మినహాయింపు వివక్షతో కూడుకున్నదని స్పష్టం చేసింది. మరోసారి రాష్ట్ర ప్రభుత్వం భంగపడింది. పాల సంఘాలు విజయాన్ని సాధించాయి .


ఈ నేపథ్యంలో ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం ఇతర జిల్లాలలో మాక్స్ చట్టం కింద రిజిష్టరు అయిన సంఘాలకు గుర్తింపునిచ్చి, రాష్ట్ర ఫెడరేషన్‌ను ఈ సంఘాలకు అప్పగించి రైతులకు మేలు చేసే విజ్ఞత ప్రదర్శించాలి. ◆




*Indianink* సౌజన్యంతో...

# కార్టూన్ కార్నర్

సెల్ ఫోన్ యుగంలో...




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
ఇం.నం. 5-10-180/ఎ&ఎ1,
బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,
హైదరాబాద్ - 500 004,
ఫోన్: 040-2323 1818
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-2323 1818. సెల్ : 80085 07934

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును **"లోక్‌సత్తా టైమ్స్"** ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | మల్టీకలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | ₹ 5000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ 2 పేజీలు | | ₹ 30,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| పూర్తి పేజీ సైజు 7''×10'' అంగుళాలు | | |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# పాల సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తి

## సుప్రీంకోర్టు తీర్పుపై జేపీ హర్షం

ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం (ఏపీ మ్యాక్స్ చట్టం–1995)కింద రిజిస్టర్ అయిన పాల సహకార సంఘాలను (డెయిరీలను) స్వాధీనం చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2006లో ఇచ్చిన ఆర్డినెన్స్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మనస్ఫూర్తిగా స్వాగతించారు. సహకార సంస్థలకు స్వేచ్ఛ కల్పించేందుకు పోరాడుతున్న లోక్‌సత్తా, తదితరులందరికీ ఇది చరిత్రాత్మక విజయం అని జేపీ అన్నారు.



సహకార సంస్థలు ప్రభుత్వం మీద ఆధారపడనంత వరకూ వాటికి పూర్తి స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ చట్టం (మ్యాక్స్) తెచ్చిన మొదటి రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ అని జేపీ అన్నారు. చిత్తూరు, కడప, గోదావరి జిల్లాలను మినహాయిస్తే మిగిలిన జిల్లాలలోని అన్ని డెయిరీలు 1995లో వచ్చిన కొత్త చట్టం కింద రిజిస్టర్ అయ్యాయన్నారు. 1964, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం కింద ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న డెయిరీలు దివాళా తీస్తుంటే, 1995 చట్టం కింద నమోదైన సహకార డెయిరీలు ఎంతో వేగంగా వృద్ధి చెందుతూ రైతులకు లాభాల పంట పండించాయన్నారు.

అయితే మ్యాక్స్ చట్టం కింద విజయవంతంగా నడుస్తున్న పాల సహకార సంఘాలను 2006, మార్చిలో ఒక ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వ పరిధిలోకి తీసుకొస్తూ రాష్ట్ర సర్కారు దిగ్భ్రాంతికర నిర్ణయం తీసుకుందన్నారు. దీన్ని ఆరోజు లోక్‌సత్తా తీవ్రంగా వ్యతిరేకించి గట్టిగా పోరాడుతోందన్నారు.

"ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రద్దయిన డెయిరీలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పునిస్తూ... ఆ ఆర్డినెన్స్ చట్టవిరుద్ధమని, రాజ్యాంగవిరుద్ధమని కొట్టివేసింది. మళ్లీ రాష్ట్రప్రభుత్వం హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకువెళ్లింది. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పునే సమర్థించి పాల సహకార సంఘాల స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించింది" అని జేపీ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి 1995 మ్యాక్స్ చట్టం కింద నమోదైన పాల సహకార సంస్థలను భూముల స్వాధీనం వంటి చర్యలతో వేధించటానికి ఇప్పటికైనా స్వస్తిచెప్పాలని జేపీ కోరారు. ◆

### అన్ని జిల్లాలలోనూ మ్యాక్స్ డైరీలు

#### ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి వర్గం

మ్యాక్స్ చట్టం పరిధిలోని పాల సహకార సంఘాల స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని రాష్ట్రంలో ఇతర జిల్లాలలో మ్యాక్స్ చట్టం కింద రిజిస్టర్ అయిన పాల సహకార సంఘాలకు ప్రభుత్వ గుర్తింపునిచ్చి వాటి కార్యకలాపాలకు తోడ్పడాల్సిందిగా డా॥ జయప్రకాష్ నారాయణ్ సారధ్యంలో మ్యాక్స్ డైరీల ప్రతినిధులు సెప్టెంబర్ 8వ తేదీన ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఫెడరేషన్ ఆస్తుల్ని, బాధ్యతల్ని సంఘాలకు అప్పగిస్తే ఉద్యోగుల జీతభత్యాలు, భవిష్యత్తు సహకార సంఘాలే చూసుకుంటాయి. పాడిపరిశ్రమకు ప్రోత్సాహం, సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి బాగా పనిచేస్తున్న వాటిని నాశనం చేసే దిశలో ప్రయత్నం చేస్తున్నారు అని పేర్కొన్నారు.

ఈ ప్రతినిధి బృందంలో డా॥ జేపీగారితో పాటు లోక్‌సత్తా నాయకులు డి.వి.వి.యస్. వర్మ, లక్ష్మణ్ బాలాజీ, పాల సహకార సంఘ ప్రతినిధులు ఎం. జానకి రామయ్య (విజయవాడ) సి.హెచ్. రాజేశ్వరరావు (కరీంనగర్) జి. జితేందర్ రెడ్డి (నల్గొండ), సి.హెచ్. శ్రీనివాసరావు (ఒంగోలు) ఉన్నారు.

# కాగ్ అక్షింతలు - ఇరకాటంలో కేంద్రసర్కారు

కేంద్రసర్కారు రోజుకో ఎదురుదెబ్బ తింటున్నది. అవినీతి కుంభకోణాలతో అభాసుపాలైంది. లోక్‌పాల్ చర్చ సందర్భంగా ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ అవినీతికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వారం తిరగక ముందే కాగ్ నివేదిక అటు రిలయన్స్ ఒప్పందంపైనా, ఇటు పౌరవిమానాల కొనుగోలుపైనా కేంద్ర సర్కారుకు అక్షింతలు వేసింది. జాతి సంపదైన గ్యాస్ నిక్షేపాలపై ప్రభుత్వ విధానాలు ఎంత పక్షపాతంగా వున్నాయో, దేశసంపదని తలాకాస్త దోచుకోడానికి ఎలా ద్వారాలు తెరిచారో అది బైటపెట్టింది. ప్రభుత్వం మరోసారి అవినీతిపై ఆత్మరక్షణలో పడింది.

ఇప్పుడు కాగ్ నివేదిక వెల్లడించిన రిలయన్స్ వ్యవహారాన్ని చూద్దాం.

## రిలయన్స్ డి6పై నిప్పులు చెరిగిన కాగ్

కృష్ణా గోదావరి (కేజీ) డి-6 చమురు క్షేత్రంలో కాంట్రాక్టు ఉల్లంఘన పట్ల ఆర్ఐఎల్, ఆయిల్ మంత్రిత్వ శాఖలపై కాగ్ ఆగ్రహం ప్రకటించింది. దీని వల్ల ప్రభుత్వం భారీ మొత్తంలో ఆదాయం నష్టపోతున్న కారణంగా లాభాల పంపిణీ ఒప్పందాన్ని సమీక్షించి సవరించుకోవాలని సూచించింది. కేజీ డి-6 క్షేత్రంపై ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న కాగ్ నివేదికను ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించింది.

బంగాళాఖాతంలోని కేజీ డిడబ్ల్యుఎన్-98/3 క్షేత్రంలో మొత్తం 7645 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఆర్ఐఎల్‌కు ధారాదత్తం చేయడాన్ని తప్పుపడుతూ ఆయిల్ మంత్రిత్వశాఖ, దాని టెక్నికల్ విభాగం డిజిహెచ్‌పై కాగ్ నిప్పులు చెరిగింది. బిడ్డింగ్‌లో గట్టి పోటీ కొరవడడంతో పాటు అక్కడ అవుతున్న వ్యయాలను రాబట్టే విషయంలోను, అందులో కేంద్ర ప్రభుత్వ వాటా విషయంలోను కూడా తాను పూర్తిగా సంతృప్తి చెందలేకపోయినట్టు కాగ్ పేర్కొంది. ప్రస్తుత ఉత్పత్తి భాగస్వామ్య కాంట్రాక్టు (పిఎస్‌సి) పెట్టుబడి వ్యయాలను గణనీయంగా పెంచడానికి ఊతం ఇస్తున్నదని, దీని వల్ల ప్రభుత్వం ఆ బ్లాక్ నుంచి పొందే రాబడి గణనీయంగా తగ్గుతుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. రానున్న కాంట్రాక్టుల్లో ఈ విధానాన్ని పూర్తిగా తొలగించి బిడ్డింగ్ ఆధారిత లాభాల వాటా విధానం అనుసరించాలని కాగ్ సిఫారసు చేసింది.


ఇక కేజీ డి-6 క్షేత్రంలో పెట్టుబడి వ్యయాల అంచనా విషయానికి వస్తే దాన్ని 240 కోట్ల డాలర్ల నుంచి 880 కోట్ల డాలర్లకు పెంచడానికి ఇచ్చిన అనుమతిని ప్రాజెక్టు వ్యయానికి ఇచ్చిన అనుమతిగా పరిగణించడానికి లేదని కాగ్ పేర్కొంది. దాన్ని ఆ క్షేత్రంలో పెట్టిన వాస్తవ పెట్టుబడిపై నిర్వహించిన ఆడిట్ ఆధారంగా నిర్ణయించాలని కూడా కాగ్ అభిప్రాయపడింది. ధీరూభాయ్ 1, 3 క్షేత్రాల అభివృద్ధికి సంబంధించి ఆర్ఐఎల్ 2004లో మే నెలలో సమర్పించిన ప్రాథమిక ప్రణాళికలో (ఐడిపి) పెట్టుబడి వ్యయాలను 240 కోట్ల డాలర్లుగా అంచనా వేసింది. ఆ తర్వాత 2006 అక్టోబర్‌లో దానికి అనుబంధ ప్రణాళిక (ఎఐడిపి) పంపుతూ పెట్టుబడి వ్యయం తొలిదశలో 520 కోట్ల డాలర్లు, రెండో దశలో 360 కోట్ల డాలర్లుగా సవరించింది. కాని కార్యాచరణలోకి వచ్చే సరికి ఎఐడిపిలో ప్రతిపాదించిన కార్యకలాపాలన్నింటినీ అనుబంధ ప్రణాళిక ప్రతిపాదన, ఆమోదం కన్నా ముందుగానే చేపట్టారని, అంటే అక్కడ జరిగిన అభివృద్ధి పనులన్నీ ఎఐడిపి ప్రాతిపదికగానే జరిగాయని అర్థమవుతున్నదని కాగ్ వ్యాఖ్యానించింది.

కేజీడి-6 క్షేత్రంలోనే ఉన్నఎంఏ ఆయిల్ ఫీల్డ్ పనులను ఆర్ ఐఎల్ సింగిల్ బిడ్ ప్రాతిపదికన ఆకర్ కంపెనీకి కట్టబెట్టడాన్ని కూడా కాగ్ తప్పు పట్టింది. తమ పరిశీలన ప్రకారం చాలా మంది వెండర్లు దానికి ప్రీ క్వాలిఫైఅయ్యారని, కాని టెక్నికల్ బిడ్‌లస్థాయికి వచ్చే సరికి వారందరినీ పక్కకు పెట్టి ఆకర్‌కు దాన్ని ధారదత్తం చేసినట్టు తేలిందని కాగ్ పేర్కొంది. ఈ చర్య కూడా పిఎస్‌సికి అనుగుణంగా లేదని కాగ్ అభిప్రాయపడింది. ఆకర్ గ్రూప్ కంపెనీలకు కట్టబెట్టిన ఎనిమిదింటితో సహా కేజీ డి-6 క్షేత్రంలోని 10 కాంట్రాక్టుల పైనా మరింత లోతైన సమీక్ష జరగాలని కూడా కాగ్ సూచించింది. ◆

# మూడు యాత్రలు - ముగ్గురు యాత్రీకులు

## అద్వానీ అవినీతి వ్యతిరేక రథయాత్ర

### బిజెపిలో అవినీతి "గాలి"



రాజకీయ రథయాత్రలకి దేశంలోనే అద్వానీకి పెట్టింది పేరు. ఇప్పటికి 5,6 రథ యాత్రలు చేశారు. ఇప్పటివరకు అద్వానీ చేసిన యాత్ర లలో ఎంచుకున్న అంశం వివాదాస్పదంగా వుండేది. వ్యక్తిగతంగా ఆయన నీతి నిజాయితీలను ఎవరూ శంకించలేదు. ఎన్ని వ్రతాలు చేసినా ఫలితం దక్కనట్టు ఎన్ని యాత్రలు చేసినా ఆయన ప్రధాని కాలేకపోయారు. ఆయన రథయాత్రలు ఆయనకి బి.జె.పిలో అగ్రనేతగా తిరుగు లేని స్థానాన్ని సాధించింది, కాని వివాదాస్పద ప్రచార అంశాలు ఆయన ప్రధాని పదవికి ఎదురొచ్చాయి. ఇప్పుడు అద్వానీ రథయాత్ర అవినీతికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారు.

ఈ అంశం వివాదస్పదం కానిది, దేశప్రజలకు అవసరమైందీ, ఆమోద యోగ్యమైందీ కూడా. అయినా ఈ యాత్ర అద్వానీకి లబ్ధి చేకూర్చేదిగా కనిపించడంలేదు. ఎందుకంటే అవినీతిని ఆయన ఒక దేశ సమస్యగా మొత్తం రాజకీయాన్ని అవహించిన సమస్యగా కాకుండా కేవలం వ్యతిరేక రాజకీయ పక్షాల మీద ధ్వజమెత్తే రాజకీయ అస్త్రంగా వినియోగించాలని ప్రయత్నిస్తున్నారు. బి.జె.పి ప్రభుత్వాలు ఒక్కొక్కటీ అవినీతిలో కూరుకుపోవడాన్ని విస్మరిస్తున్నారు. అదే ఆయన యాత్రకు ఎదురొచ్చే అంశం కానుంది. ఈ ద్వంద్వ ప్రమాణాలే ఆయన యాత్రకు విశ్వసనీయత లేకుండా చేసేది కానుంది. అందువల్ల ఈ యాత్ర ఆశించే ఫలితాలనిచ్చేదిగా గోచరించడంలేదు.

కర్నాటకలో బి.జె.పి. ప్రభుత్వం సాగించిన భాగోతం అందరికీ తెలిసిందే. లోకాయుక్త నివేదిక తర్వాత బి.జె.పి. ముఖ్యమంత్రి యడ్యూరప్ప రాజీనామా చెయ్యాల్సి వచ్చింది. వెనువెంటనే ఆ మంత్రివర్గంలో వున్న గాలి జనార్ధన రెడ్డి బండారం బైట పడింది. రెండు రాష్ట్రాలను ఏకమొత్తంగా దోచుకున్న వైనం రట్టు అయింది. ఆయన జైలుకు వెళ్ళాడు. కళ్ళు చెదిరే ఆస్తులు వెలుగు చూస్తున్నా ఇదంతా తమకు పట్టనట్టు బి.జె.పి అగ్రనాయకత్వం వ్యవహరిస్తున్న తీరు పిల్లి పాలు తాగుతూ కళ్ళు మూసుకున్న సామెతను జ్ఞప్తికి తెస్తుంది.

ఈలోగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిని మార్చారు. అవినీతి ఆరోపణలలో మునిగిపోయిన తన ప్రభుత్వ ప్రతిష్టను ఎన్నికల ముందైనా ప్రక్షాళన చెయ్యాలని తలపెట్టారు. ఇంతలోనే చత్తీస్‌ఘడ్ ప్రభుత్వంపై లోకాయుక్త నివేదిక బి.జె.పి. అవినీతి పాలనకు దర్పణం పట్టింది. ఇలా బి.జె.పి. పాలిత ప్రభుత్వాల అవినీతి ఒక్కటొక్కటే బైటకొస్తున్నాయి. ఈ దశలో అద్వానీ అవినీతి వ్యతిరేక యాత్ర ప్రయోజనకారి కంటే ప్రతికూలతనే మూట కట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## బాబు యాత్రల జోరు విశ్వసనీయతే కరువు



రాష్ట్రంలో చంద్రబాబు యాత్ర చెయ్యని సమస్య అంటూ లేదు. రైతుల సమస్యలమీద, మద్యం నియంత్రణమీద, నీటి ప్రాజెక్టుల మీద, సెజ్‌ల మీద, ఇప్పుడు అవినీతి మీద యాత్రల మీద యాత్రలు చేస్తున్నారు. ఆయన పడుతున్నంత శ్రమ మరొకరెవరూ పడడంలేదు. ఇంత చేస్తున్నా ఆయన ఆయా వర్గాల విశ్వాసాన్ని చూరగొంటున్నారన్న నమ్మకం రాజకీయ విశ్లేషకులకి కలగడం లేదు. రైతుల దగ్గరికి వెడితే వారు నిలదీస్తున్నారు. మద్యంపై మాట్లాడితే మహిళలు నిగ్గదీస్తున్నారు. విద్యార్థులు ప్రశ్నల పరంపర గుప్పిస్తున్నారు. ఆయన ప్రతిపక్షంలో వుంటే ఒక మాట అధికారంలోకి వస్తే మరో చేత చేస్తారని తలపోస్తున్నారు. అధికారంలో వుండగా మద్యనిషేధాన్ని సడలించి, బెల్టుషాపులకు శ్రీకారం చుట్టి ఇప్పుడు నియంత్రణ అంటే ప్రజలకి నమ్మశక్యం కానిదైంది. వ్యవసాయ రంగాన్ని, సాగునీటి ప్రాజెక్టులనీ

దాదాపుగా విస్మరించి (చంద్రబాబు తన హయాంలో) ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం వారికి రుచించడంలేదు. అలానే తమ పాలనలో పథకాలలో అవినీతి ఏరులైపారినా భూపందేరాల గోల్‌మాల్‌లు జరిగినా చూసీ చూడనట్టు వదిలేసి ఇప్పుడు అవినీతిపై పోరాటాన్ని జరపడాన్ని ప్రజలు విశ్వసించ లేకపోతున్నారు. చంద్రబాబు సమస్య విశ్వసనీయత. ఆయన ద్వంద్వప్రమాణాలు ఇప్పుడు ఆయనకు ఎదురొస్తున్నాయి. ప్రజలలో ఒకసారి విశ్వసనీయత కొల్పోతే తిరిగి రాబట్టుకోవడం ఎంత కష్టమో చంద్రబాబు రాజకీయం ఒక ఉదాహరణగా వుంటుంది.

జగన్‌పై సి.బి.ఐ. విచారణ ప్రారంభం కావడం, ప్రజలలో అవినీతిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడాన్ని తన రాజకీయ భవిష్యత్తుకు సోపానంగా చేసుకోడానికి రాష్ట్రంలో ప్రతిపక్షనేత చంద్రబాబు కూడా రాష్ట్రంలో యాత్రను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. చంద్రబాబుకు యాత్రలు కొత్త కాదు. ఆయన ప్రతి సమస్య మీద ఒక యాత్ర నిర్వహించడం అలవాటుగా చేసుకున్నాడు. ఆయనకు ఫలితం కంటే ప్రచారం ముఖ్యం అని ఆబాలగోపాలనికి తెలిసేలా యాత్రలు సాగించారు.

ఈ యాత్రకు వెళ్లే ముందు తన ఆస్తుల ప్రకటన చేసి తన సచ్ఛీలతను చాటుకుని మరీ యాత్ర చెయ్యాలని సంక ల్పించారు. కేవలం 49 కోట్ల ఆస్తులే ప్రకటించి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఆయన ఏం చెప్పినా విశ్వసనీయత లేకపోవడానికి ఇలాంటవే కారణం అవుతున్నాయి.

## జగన్‌కు ఢిల్లీయాత్ర దక్కని "ఓదార్పు"



హైకోర్టు ఆదేశాల మేరకి జగన్ ఆస్తులపై సి.బి.ఐ విచారణ నిర్వహిస్తున్నది. ఈ విచారణ నిలుపుచెయ్యాల్సిందిగా జగన్ రెండుసార్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాని తీర్పులు సానుకూలంగా రాలేదు. దాంతో సి.బి.ఐ విచారణ తన తండ్రి రాజకీయ జీవితంపై బురదజల్లే ప్రయత్నంగా, తనపై కక్ష సాధింపుచర్యగా వేధింపుల సానుభూతి కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. 29 మంది శాసనసభ్యుల చేత రాజీనామాలు చేయించి కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం మీద ఒత్తిడి పెంచడానికి పూనుకున్నారు. ఇప్పటివరకూ ప్రజల్ని "ఓదార్చ" డానికి తాను చేస్తున్న యాత్ర ఇప్పుడు తనని ఓదార్చే వారికోసం వెతుకులాట యాత్రగా ఢిల్లీ యాత్ర చేశారు. ప్రతిపక్షం, అధికార పక్షం తేడా లేకుండా ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా గడప గడపనీ వదలకుండా కడప నేత ప్రయత్నాలు చేశారు. కాని ఏ ఒక్కరూ వీరిని అక్కున చేర్చుకోలేదు. ఎంత దూరంగా వుంటే అంత మంచిదన్న ధోరణిలో వ్యవహరించారు. సంప్రదాయ పార్టీలన్నీ అవినీతి మరకలతో సతమతమౌతున్న తరుణంలో జగన్‌తో జతకట్టడానికి సిద్ధం కాలేకపోయారు. ఢిల్లీలో జగన్‌కు ఓదార్చేవారు కరువయ్యారు. ◆

**- సవ్యసాచి**

**అక్టోబరు 2 గాంధీజీ జయంతి**

# లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

## అన్ని మున్సిపల్ పట్టణ, మండల కేంద్రాలలో

అక్టోబరు 2 – గాంధీ జయంతి రోజున లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని మున్సిపల్ పట్టణాలలో, మండలకేంద్రాలలో పార్టీ శాఖలు వున్న మున్సిపల్ వార్డులలో, గ్రామాలలో ఘనంగా నిర్వహించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

- ఉదయం గాంధీ విగ్రహాల దగ్గర ప్రతిజ్ఞ
- పార్టీ కార్యాలయం దగ్గర జాతీయజెండా, పార్టీ జెండాల ఆవిష్కరణ

**సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠులు**

- అవినీతి రహిత పాలన కోసం – బలమైన లోక్‌పాల్ చట్టం, ఎన్నికల సంస్కరణలు, రాజకీయ సంస్కరణలు
- పౌరుల సాధికారత కోసం – బలమైన స్థానిక ప్రభుత్వాలు – స్వయం ప్రతిపత్తి గల సహకార సంఘాలు

ఈ అంశాలపై సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠులు నిర్వహించాలి.

# సంక్షోభాల నుండి పరిష్కారాలు

- బండారు రామ్మోహన రావు

మన దేశంలో నేడు రాజకీయ, పాలనా, నైతిక సంక్షోభం పరాకాష్టకు చేరింది. దేశంలో అవినీతి కుంభకోణాలు ఒక్కటొక్కటిగా బయటపడి క్యాబినెట్ మంత్రులే జైలుపాలయ్యారు. కర్ణాటక పరిణామాలు, గాలి జనార్ధన్ రెడ్డి. అరెస్టు కావడంతో అవినీతి విషయంలో అధికార పక్షమైన కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బి.జె.పి. ఆత్మరక్షణలో పడిపోయాయి. బి.జె.పి.ని గట్టిగా వ్యతిరేకించే వామపక్షాలు ఊహిస్తున్న మూడో "ఫ్రంట్" ఒక మిధ్యగా మారింది. సంకీర్ణ రాజకీయాల యుగంలో అవకాశవాద రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. అందుకే నిర్ణయాలలో నిర్దిష్టత, స్పష్టత ఉండడం లేదు. పాలన గాడి తప్పింది. మంత్రివర్గం, పార్లమెంటుకు అతీతంగా "టెన్ జనపత్" నుండి సోనియాగాంధీ అధ్వర్యంలోని జాతీయ సలహామండలి అన్ని నిర్ణయాలు తీసుకుంటుంది. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లు కోసం అన్నాహజారే దీక్ష దేశాన్ని ఒక కుదుపు కుదిపింది. అవినీతి వ్యతిరేక ఉద్యమాల వాతావరణం దేశమంతటా నెలకొంది. యువతతోపాటు ప్రజాస్వామ్య ప్రియులందరూ అన్నాహజారే వెంట మేమున్నాం అన్నారు. లోక్‌పాల్ బిల్లు ఒక్కటే చాలదని ఆ తర్వాత ఎన్నికల సంస్కరణలు, పాలనా సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నాహజారే ప్రకటించారు. సంస్కరణల వేడి దేశంలో పెరిగింది. ఇక సాగదీయడమే తరువాయి.

మన రాష్ట్రంలో మరోరకంగా ఈ రాజకీయ సంక్షోభం నేలకొంటది. తెలంగాణ సంక్షోభం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎం.పి.ల రాజీనామాలు చేశారు. "సర్వజనసమ్మె" సైరన్ మోగింది. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో అధికారికంగా విలీనం అయింది. అంతలోపే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పురుడుపోసుకుంది. పురిట్లోనే సంధిగా జగన్ అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది. న్యాయవ్యవస్థ, క్రియాశీలత పుణ్యామా అని రాష్ట్రంలోని అవినీతి కుంభకోణాలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. నిన్నటిదాకా జగన్ చేసిన ఓదార్పు యాత్రలు తనకే సానుభూతి యాత్రలుగా మారాయి. రాష్ట్రంలో పాలన కుంటుపడింది. సామాన్యుడి బాధలు రాష్ట్రప్రభుత్వం పట్టించుకున్న జాడ కనబడడంలేదు. పాలన ఒక "యధాలాప కార్యక్రమం"గా మారింది. ప్రభుత్వ ఉద్యోగులు ఆటవిడుపుగా పనిచేస్తున్నారు. సామాన్యుడి బాధలు అరణ్యరోదనగా మిగిలిపోతున్నాయి.

ఇక రాజకీయ పార్టీల విషయానికి వస్తే అనేక అంశాలలో స్పష్టత కొరబడింది. ఏది మాట్లాడితే ఏమౌతుందోనని కొన్ని పార్టీలు మౌనంగా ఉండిపోతే, ఏదైతే అయిందని మరికొన్ని పార్టీలు తెగిస్తున్నాయి. ఇక ఆయా పార్టీలలో కొందరు మాత్రం తమ పార్టీ అంగీకరించిన విధానాలకు వ్యతిరేకంగా ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నారు.

ఈ పరిస్థితులను చూసిన యువత, పౌరసమాజం అవేశంతో ఈ రాజకీయాలనే అసహ్యించుకొనే స్థితికి వచ్చింది. ఈ సంక్షోభం నుండి మంచి పరిష్కారాన్ని సాధించే బాధ్యత లోక్‌సత్తా పార్టీ మీద ఉంది. సాంప్రదాయ పార్టీల డొల్లతనాన్ని బయటపెట్టడం, సరైన పరిష్కారాలను ప్రజల ముందుంచడం చేయాలి. ప్రత్యామ్నాయ వేదికగా తయారుకావాలి. వచ్చిన ప్రతీ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. నదిలో ఎన్ని నీళ్లున్నా మనం తీసుకెళ్ళే పాత్రను బట్టే ఆ నీళ్ళను పట్టుకోగలుగుతాము. అలాగే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే దానిక తగిన పార్టీ యంత్రాంగం సంస్థాగత నిర్మాణం అవసరం. లేకుంటే ఎన్ని అవకాశాలు వచ్చినా దానిని మనం అందిపుచ్చుకోలేము.

పార్టీ సభ్యులను చేర్చుకోవడం, శాఖలు ఏర్పరచడం, వాటికి ఎన్నికలు నిర్వహించుకోవడం, శిక్షణ ఇవ్వడం చేయాలి. పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చెయ్యాలి. వివిధ అంశాలపై స్పష్టంగా ప్రజల్లోకి వెళ్ళగలగాలి. ప్రజాసమస్యలను పార్టీ ఎజెండాగా మలచుకోవాలి. వారి సమస్యలను మన ఎజెండాతో ముడివేయాలి. మంచి పరిష్కారాలు చూపాలి. సమన్వయంతో ప్రజలను కలుపుకొని ఉద్యమాలు చేయాలి. అప్పుడే మన పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుంది, "సారా" పార్టీలకు సరైన ప్రత్యామ్నాయ వేదికగా మన పార్టీ తయారు అవుతుంది. ◆

# నేటికీ అభివృద్ధిలేని ప్రాంతాలు ఉండడం సిగ్గుచేటు

- గీతామూర్తి

స్వాతంత్య్రం వచ్చి 6 దశాబ్దాలు దాటినా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలున్నాయంటే మనం సిగ్గుపడాల్సిన విషయం. ఇప్పటికి గ్రామాల్లో మహిళలు మరుగుదొడ్డికి గ్రామశివారుకు, చెట్లపొదల్లోకి వెళ్తున్నారంటే అభివృద్ధి అన్న పదం డిక్షనరీలో చూడాలి. గ్రామాల్లో కనీస వసతులైన విద్య, వైద్యం, మంచినీటివసతి ఆయా ప్రాంతాల్లో కల్పించక ప్రజలు అల్లాడిపోతున్నారు. కనీస విద్య, వైద్యం కోసం జిల్లా కేంద్రాలకు గాని, పెద్ద పట్టణాలకు గాని రావాల్సిందే. ఈ రెండింటికి సంపాదనలో 60% ఖర్చు చేస్తున్నారంటే ఎంత అభివృద్ధిలో వున్నామో తెల్సుకోవాలి. వీటన్నింటిని పట్టించుకొని ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన రాజకీయం సీట్ల కోసం, ఓట్లకోసం పరిమితం అయింది. ప్రజాసేవ పేరుతో గూండాలు, రౌడీలు, మాఫియా, నేరచరిత్రవున్నవారు రాజకీయంలోకి రావడం మామూలైంది. సీట్ల కోసం పార్టీలకు ముడుపులు చెల్లించడం ఎంతపెద్ద పెట్టె అయితే అంతసీటు అన్నట్లు వీరు ఇలా ఇవ్వడం పార్టీలు అభ్యర్థులుగా పోటీలకి దింపడం మామూలైంది. దీన్ని పెట్టుబడిగా పెట్టి ఎన్నికలలో కోట్లు ఖర్చుచేసి ప్రజల్ని ప్రలోభపెట్టడానికి మద్యం, డబ్బు, చీరలు, కుంకుమభరిణలు లాంటివి ఇచ్చి సీటు రాజకీయాలు చేస్తున్నారు. ఈ ఖర్చు పెట్టిందంతా 5ఏళ్ళలో రాబట్టాలి కాబట్టి ఏ విధంగా లాభం వస్తుంది? భూకబ్జాలా? సెజ్‌లా? సెటిల్‌మెంట్‌లా? కులమా? మతమా? ప్రాంతమా? అడ్డగోలుగా సంపాదించడానికి ఏం తీసుకోవాలి అని ఆలోచించి వాటిని సంపాదించడానికి వీటిని నిచ్చెనలుగా వాడుతున్నారు. 10 కోట్లు ఖర్చుచేసి, కనీసం 10 తరాలకు సరిపడా సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్న మన ప్రజాప్రతినిధులకు ఈ సమస్యలు కన్పిస్తున్నాయా? ప్రస్తుతం ప్రజలు మనం ఎనుకున్న ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కారం చూపగలుగుతారా? అని ఆలోచించాల్సివుంది. మనకు రాజ్యాంగం ఏర్పడి, ఎన్నికలు జరిపినప్పటి నుండి చూస్తే మరి ఇన్ని రోజుల నుండి ఎ.పి.లోని 294 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఏంచేస్తున్నారు? 42 మంది ఎమ్.పిలు ఏంచేస్తున్నారు? వారికి ఇన్ని సంవత్సరాలలో కేటాయించిన నియోజకవర్గాల నిధుల సంగతి ఏమిటి? అభివృద్ధి కోసం కేటాయించిన నిధులలో ఎంత ఖర్చు చేయగలిగారు. ఇంతవరకు నియోజకవర్గాలలో అభివృద్ధి ఏ మేరకు జరిగింది అని ప్రజలు, మీడియా ఏనాడైనా దృష్టి పెట్టిందా? వీరంతా నియోజకవర్గాలలో ఎలాంటి సమస్యలు గుర్తించారు? వీటికోసం ఏ విధమైన కృషి చేసారు? మంచి పనులు చేసి అభివృద్ధి చేసిన నియోజకవర్గాన్ని అభినందించాల్సిందే కదా? ఇప్పుడు మన ముందు ఇది పెద్ద ప్రశ్న. ఇప్పుడు మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని ఒక ప్రాంతం వారు అంటే మా ప్రాంతం అభివృద్ధి జరగలేదని ఇంకో ప్రాంతం వారు అంటున్నారు అంటే ఇంత వరకు మనం ఎనుకున్నది అసమర్థులు అన్న సంగతి వారే చెప్తున్నారు కదా! ఏ ప్రాంతంలో సమస్యలు వున్నా ఎంతో ఉన్నతమైన చర్చా వేదికలైన అసెంబ్లీ, పార్లమెంటులో శాంతియుతమైన చర్చలు జరగే ఆస్కారం లేదా? ప్రజా ప్రయోజనాలకు తూట్లు పడాల్సిందేనా? ఒక చేత్తో ఓటు వేసి ఇంకోచేత్తో పన్నులు కట్టి గల్లీ నుండి ఢిల్లీ వరకు మా సమస్యల నుండి బయట పడేయండి మా గొంతులన్ని కలిపి మీ గొంతులో విన్పించండి అని ఎన్నుకున్న ప్రజలకు ఏం సమాధానం చేప్తారు వీళ్ళు. మీకు వేదికలుగా వున్న వాటిలో శాంతియుతమైన చర్చలు జరపకుండా, రోడ్లపైన వాగ్వాదాలు జరుపుకుంటుంటే సమస్యలు పరిష్కారం అవుతాయా? ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవన విధానానికి సంక్లిష్ట పరిస్థితిని తెచ్చిన ఈ పార్టీలు సీట్ల కోసం ఫీట్లు చేస్తుంటే, సామాన్యమైన జనానికి కష్టాలు తెచ్చిపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాదిన్నరగా విచిత్ర పరిస్థితి నెలకొంది. ఒకప్రాంతం వారు తెలంగాణా కావాలంటుంటే ఇంకో ప్రాంతంవారు సమైక్యంగా వుండాలంటూ రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు పాలనా వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారు. అధికార, ప్రతిపక్షపార్టీలకు సంబంధించిన ఏ ప్రాంతనేతలు ఆ ప్రాంతం కావాలని ప్రజలతో ఆటలాడుతున్నారు. రాజీనామాలు చేయడం, వెనక్కి తీసుకోవడం, దాన్ని పబ్లిసిటీ చేసుకొని సంపతి

సంపాదించాలనుకోవడం, పాల అభిషేకాలు,ఫ్లెక్సీలు బ్యానర్లు కట్టుకొని డబ్బాకొట్టుకోవడం చూసి చిన్నపిల్లలు కూడా నవ్వే స్థితి వచ్చింది. అసలు ఏ ప్రాంతం కావాలన్నా ఆ ప్రాంతం యొక్క సమస్యలు అక్కడే పరిష్కారం అనే సంగతి మరిచిపోయి మన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో పరిష్కరించకుండా పార్లమెంటునకు నెట్టివేసి గోటితో పోయేదానికి గొడ్డలి తెచ్చారు. శాసనసభలో చర్చలు జరగనే లేదు. తెలంగాణా విషయం కొన్ని 40 ఏళ్ళుగా కొనసాగుతుంటే దీన్ని ఏ మాత్రం పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా ఎవ్వరి లాభం వారు చూసుకుంటున్నారు. వీరంతా చేసింది. ఓటు బ్యాంకు, సీటు రాజకీయాలు అన్న సంగతి అయినట్లయితే చరిత్ర ముందు దోషులుగా నిలబడాల్సిందే. ప్రాంతీయ అసమానతలని అడ్డం పెట్టుకొని బంద్‌లు, రాస్తారోకోలు, ధర్నాలు, బస్సులు ధ్వంసం చేయడం, అద్దాలు పగలగొట్టడం, ప్రభుత్వ ఆస్తులు తగులబెట్టడం ద్వారా తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేయడం వలన సామాన్యమైన ప్రజలమీద అదనపు భారం పడడమే కాకుండా, చదువుకుంటున్న విద్యార్థులని ఇబ్బంది పెట్టుంది. సమస్యను ఏ రకంగా పరిష్కరించుకుందాం? ప్రజలు ఇచ్చిన అధికారంతో విజ్ఞతతో ఎలా వ్యవహరిద్దాం అనే కనీసమైన ఆలోచనలు మన నేతలకు లేకపోవడం విచారకరం. మన నేతలు అమలు చెయ్యాలనుకుంటే 6 సూత్రాల పథకంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డును, 610 జీఓని ఎందుకు అమలులోకి తేలేదు. స్వంత లాభం కోసం అన్ని పార్టీలు కుమ్మక్కయి నిజాయితీగా అమలుపరచకుండా ఇప్పుడు నువ్వుదొంగ, నువ్వుదొంగ అంటూ ఒకరినొకరు అనుకోవడం హాస్యాస్పదం. సైద్ధాంతికంగా లాభమా? నష్టమా? ప్రజల ప్రయోజనానికి ఏంచేస్తే బావుంటుంది అనే అంశాలపై అవతల ప్రాంతం వారి అభిప్రాయాలు తెలుసుకుందామన్న ఆలోచనలు కూడా కలగకపోవడం విచారకరం.

చదువులు పోతున్నాయి, నీళ్ళు పోతున్నాయి. ఉద్యోగాలు పోతున్నాయి. ఆంధ్రావాలా గోబ్యాక్ అంటూ వీళ్ళు, తెలంగాణా ఖబడ్దార్ అంటూ పరస్పరం రకరకాల తిట్లు, దుమ్మెత్తిపోయడం లేదా నేను చెప్పిందే కరెక్ట్, ఒక ప్రాంతానికి సంబంధించిన నేతలను ఇంకో ప్రాంతంలో తిరగనివ్వం అని, ఇళ్ళపైన దాడులు, వాహనాలు అడ్డుకోవడం ఆయా ప్రాంతాల్లో తమ ప్రాంతం పట్ల ఇతర పార్టీల వైఖరి చెప్పాల్సిందే అని బెదిరించడం ఆఖరికి అసెంబ్లీ ఆవరణలో దాడి చేయడం అన్నది వికృత రాజకీయాలకు చిహ్నం. మనకు గతంలో ఎన్నో ఉద్యమాలు చేసినా అహింసా మార్గంలో వచ్చి ఎవ్వరిని ఇబ్బంది పెట్టలేదు. ఉద్యమాన్ని నడిపే నాయకుడు ముందుండి శాంతియుతంగా నడిపించేవాడు. స్వాతంత్ర ఉద్యమం ఇలా జరిగితే, ప్రస్తుత రాజకీయ ధోరణులు పెడమార్గాన పోతున్నాయి. నాయకుడు మాట్లాడుతున్న భాష, ప్రవర్తనను ఆవేశంలో వున్న యువత అనుకరించడం వలన అమాయకులైన నిరుపేద యువత అన్ని ప్రాంతాల వారు నష్టపోతున్నారు. ముఖ్యంగా ఆ కుటుంబం తీవ్ర నష్టానికి గురి అవుతుంది. ఏ ప్రాంతం నాయకులైనా వారి పిల్లలు హాయిగా విదేశాల్లో ఉన్నత విద్యలను అభ్యసించుకుంటుండగా సామాన్యమైన పేద కుటుంబాల పిల్లల్లో మాత్రం అగ్నిని రగిలిస్తున్నారు. ఒక్క నాయకుడికి కాని, వారి పిల్లలకు గాని ఎలాంటి గాయాలు జరగలేదంటే ఇక్కడ యువత గమనించాలి. వీరు ప్రజలకోసం కాదు. తమ కుటుంబాల కోసం అని. క్షణంలో ప్లేటు ఫిరాయించే ఈ నాయకులు భవిష్యత్‌లో మన గురించి ఆలోచిస్తారనే నమ్మకం వుందా? అని. 14ఎఫ్ నిబందన తొలగించాలి అన్న సంగతి కూడా మిగతా పార్టీలు సుప్రీంకోర్టుకు వెళ్ళాలన్న ప్రభుత్వ వైఖరిని బలపర్చగా కేవలం లోక్‌సత్తా మాత్రం దీన్ని తీర్మానం అసెంబ్లీలో చేయాలని జేపీగారు సూచించారు. ఏ పార్టీ ఎజెండా ఏదైనా ఆయా ఎజెండాలను సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా, శాంతియుతంగా పరిష్కారం కొరకు రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసుకోవాలి తమ ఎజెండాను ఒప్పుకోవాల్సిందే అనే ఫాసిస్ట్ ధోరణి మంచిది కాదు. చంపుతాం, కొడ్తాం, నరుకుతాం ఇవన్నీ మంచి రాజకీయ లక్షణాలు కావు.

ఎత్తిపోతల విషయంలో లోక్‌సత్తా చాలా స్పష్టంగా చెప్తుంది. గోదావరి నది జలాల్ని కరీంనగర్ జిల్లా ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కి తరలించకుండా ఆ ప్రాంతంలో సాగునీటి అవసరాలు తీర్చాలని, హైదరాబాద్‌కు కృష్ణానది 3వ దశ పథకాన్ని చేపట్టాలని నగరంలోని 23 మంది ఎమ్మెల్యేలను సమీకరించి చర్చలు చేస్తుంది లోక్‌సత్తా. అలాగే గోదావరి జలాల్ని కృష్ణా నదిలోకి మళ్లించి కృష్ణా జలాలను ప్రధానంగా తెలంగాణా, రాయలసీమ జిల్లాల్లోని మెట్టప్రాంతాలకు వినియోగించాలి అంటుంది దీనిపైన చర్చించే నాథుడే లేరు. ఎప్పుడైనా ఇలాంటి అంశాలపై చర్చలు జరిపినప్పుడు ఇంతకన్నా మంచి పరిష్కారం

దొరుకుతుందా అనే చూడాలి కదా?

రైతులు పూర్తిగా సంక్షోభంలో వుండి పంట పండక పోయినట్లయితే దేవుడ్ని తిట్టేవారు, ప్రకృతిని తిట్టేవారు పంటపండి పుష్కలంగా వుండి ధరరాక నిస్సహాయంగా రైతులు వుంటే కనీసం ఆయా ప్రాంత నేతలు వీటి గురించి ప్రస్తావన కాని, అసెంబ్లీలో లేవనెత్తడం కాని చెయ్యకుండా సర్వరోగ నివారిణి జిందాతిలిస్మాత్ అన్నట్లు అన్నింటికి ఆయా ప్రాంతం వెనుకబడడం కారణం అన్నది సాధారణమైంది. నేను ఈ ప్రాంతానికి అనుకూలం అని చెప్పినట్లు నటించకుండా పిరికి తనాన్ని వీడి ధైర్యంగా పరిష్కారం వైపు వెళ్ళాల్సిందే. ఈ పరిష్కారం పొందాగా, సరైన కోణంలో ఎవ్వరి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా చూపగలగాలి. సమస్యలపై విస్తృతమైన, లోతైన అవగాహనతో చర్చలు జరిపినప్పుడు ఒకరికొకరు విమర్శించుకోకుండా నిజాయితీ కావాలి. దానికి సమర్ధతకావాలి. ముందు ఈ కనీస ప్రమాణాలు విధిగా పాటించి, పుట్టిన ప్రతిబిడ్డ ఎదిగే అవకాశం కల్పించాలి. వివక్షత లేని సమాజం కావాలంటే విద్య, వైద్యం, ఉపాధినైపుణ్యాలు మహిళలు, రైతులు వారి కాళ్ళమీద వారు నిలబడే విధంగా ఆలోచించాలి. మన రాజకీయ పార్టీలు విద్య, వైద్యం, తప్ప అన్ని ఉచితం అంటూ ఇచ్చేస్తాయి. ఈ రెండు ఉచితంగా ఇచ్చినట్లయితే ఆర్థిక అసమానతలు తొలుగుతాయి. ప్రజలకు నిజమైన ఆత్మగౌరవం కల్పించాలంటే ప్రజలకు అధికారం చేతికి ఇచ్చే ఏర్పాటు చేయాలి. ఈ రాజకీయం మనదని జనం గుర్తించాలి. ఈ కేంద్రీకృత పాలనలో ప్రాంతాలు విడిపోయినా, కలిసివున్నా అభివృద్ధి మాట సున్నా అన్న సంగతి గుర్తుపెట్టుకోవాలి. ఇందుకోసం ప్రతి జిల్లాలో ఎన్నికైన జిల్లా కౌన్సిల్‌ని ఏర్పాటు చేసేలా 371–డిలో మార్పులు చేసి, రాజ్యాంగం 11,12వ షెడ్యూల్‌లోని అధికారాలు ఇచ్చి, జిల్లాస్థాయిలో, వార్డుస్థాయిలో ప్రజలకే తలసరి ఆదాయం, అధికారం ఇచ్చే ఏర్పాటు చేయాలి. ప్రాంతీయ అసమానతలకు వికృత స్థాయికి చేరుకోవడానికి మితిమీరిన కేంద్రీకృత వ్యవస్థ స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయడం ప్రధాన కారణం. 73,74వ రాజ్యాంగ సవరణలు వచ్చినా సాధికారత అమలులోకి రాలేదు. మన గల్లీ సమస్యలు జిల్లాలోపే పరిష్కరించాలి. ఇలా చేయడం వలన అవినీతి తగ్గుతుంది. పరిపాలన సవ్యంగా వుండి. ప్రజలకు అధికారం, ఆదాయం వుంటుంది కాబట్టి అభివృద్ధి సాధ్యం. ◆

# తీవ్ర రోగాల వైద్యసేవలకు కేంద్ర ప్రభుత్వ పథకం

**చికిత్సకు రూ॥15 లక్షలు పొందే అవకాశం**

క్యాన్సర్లు, గుండె, మూత్ర, జీర్ణకోశ, మూత్రపిండాల మార్పిడి, తీవ్రమైన రక్తహీనత లాంటి వాటికి చికిత్స చేయించుకోవాలంటే పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఆరోగ్యనిధి కింద 1997 నుంచి ఆర్థికసాయం అందిస్తోంది. గరిష్ఠంగా రూ॥15 లక్షల వరకు పొందడానికి అవకాశం ఉంది.

– 1997లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఆరోగ్యనిధి పథకాన్ని ప్రవేశపెట్టింది.

– ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద రోగులకు అయ్యే చికిత్సా వ్యయం రూ॥లక్షన్నర కంటే మించితే, ఈ పథకం కింద ఆర్థికసాయం పొందే అవకాశం ఉంది.

– రోగి ఆస్పత్రి సూపరింటెండెంట్ ద్వారా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖకు దరఖాస్తు చేసుకుంటే, కమిటీ పరిశీలించి చికిత్సకు అయ్యే ఖర్చును నేరుగా సంబంధిత ఆస్పత్రికి పంపిస్తుంది.

– ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, ఒరిస్సా రాష్ట్రాలకు చెందినవారు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. మన రాష్ట్రంలో తగిన ప్రచారం లేకపోవడంతో పెద్దగా ఉపయోగించుకున్నవారు లేరు.

– ఈ పథకం కింద ఆర్థికసాయం పొందడానికి నిబంధనలు కఠినంగా ఉండడంతో 2008లో కొన్ని సవరించారు. 2007 నుంచి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ॥2 లక్షల వరకు ఆరోగ్యబీమా అమల్లో ఉండడంతో కేంద్ర పథకానికి తగిన ప్రాచుర్యం లేకుండా పోయింది. దీని గురించి మన వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను సంప్రదించగా, తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

**త్వరలో కొత్త మార్గదర్శకాలు :** వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారందరూ ఈ పథకం కింద లబ్ధిపొందడానికి వీలుగా ఈ పథకానికి నిధులు పెంచడంతో పాటు, నిబంధనలు సరళతరం చేయనున్నా మని ఒక కేంద్రప్రభుత్వం ఉన్నతాధికారి తెలిపారు.

# రైతుల ధర్మాగ్రహమే "పంట విరామం"

పి. భాస్కరరావు

వరుస ఉత్పాతాల బారినపడి నిస్సహాయంగా నేలరాలిన వరికంకిలా ఉందిప్పుడు రాష్ట్రంలో సగటు రైతు పరిస్థితి. ఎంతో శ్రమకోర్చి నానాకష్టాలు పడి పండించిన పంటకు కడకు దక్కే ఫలితం ఏముందన్న నిర్వేదంతో పంటవిరామం ప్రకటించినప్పుడు తొలుత అవన్నీ రాజకీయ ప్రేరేపితాలే అని కొట్టి పారేసింది ప్రభుత్వం. గోదావరి జిల్లాలో ఆరంభమైన పంటవిరామం ప్రకాశం, నెల్లూరు, ఖమ్మం, కర్నూలు, జిల్లాలకు వ్యాపించినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన విధంగా ప్రవర్తించింది. సుమారు లక్ష ఎకరాలలో రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ పంట సాగుకు విరామం ప్రకటించారు రైతులు.



రైతులు సాగుకు సెలవు ప్రకటించి అందుకు కారణాలు స్పష్టంగా ప్రకటించారు. 1. అకాల వర్షాలు, 2. ధాన్యం తడిచి మొలకెత్తడం, 3. పండించిన పంటను కొనేనాథుడు లేకపోవడం, 4. గత సంవత్సరం పంట నష్టాన్ని పరిగణలోకి తీసుకొని రుణాల చెల్లింపు వాయిదా వేయకపోవడం, 5. ఇన్‌పుట్ సబ్సిడీలు అందచేయక పోవడం, 6. మద్దతు ధరకు ప్రాధేయపడవలసిన దుస్థితిలో ఉండటం, 7. పన్నుల వసూళ్ళ కోసం ఆర్.ఆర్. చట్టాన్ని ప్రయోగించడం, 8. ఉపాధి హామీ పథకం అమలు రూపేణా కూలీల కొరత సమస్య, 9. రికార్డు దిగుబడులను ఏదో ఒక ధరకు వదిలించుకోవలసిన దౌర్భాగ్యపరిస్థితి మొదలైనవి రైతన్న పంటవిరామం తీర్మానాలకు ప్రధాన ప్రేరణ.

గత సంవత్సరం ఖరీఫ్‌లో 14 జిల్లాల్లోని 41 లక్షల ఎకరాలలో పంటపూర్తిగా దెబ్బతిని 35 లక్షల మంది రైతులు నష్టపోయారు. కర్షకుల ముక్కుపిండి దండుకున్న బీమా సొమ్ముని సకాలంలో జమచేయని కారణంగా 18 లక్షల మందికి నష్టపరిహారం దక్కే అవకాశం పోయింది.

కేంద్రం దయతలచిన మద్దతు ధరకు పైసా తగ్గకుండా కొనుగోళ్ళు సాగినా ప్రతి క్వింటా ధాన్యంపై రూ॥711 వరకు నష్టం దాపురిస్తుందని రైతు సంఘాలు గగ్గోళ్ళు పెడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో స్థూల ఉత్పత్తిలో ఇప్పటికే 24 శాతానికి పడిపోయిన వ్యవసాయ రంగం వాటా, 12వ పంచవర్ష ప్రణాళిక కాలంలో 19శాతానికి పతనం కానున్నదని అంచనా.

## పెట్టుబడి భారం కావడానికి కారణాలు

1. ప్రతిసంవత్సరం పెట్టుబడి పెరుగుతుంది. విత్తనం, ఎరువులు, క్రిమిసంహారక మందుల రేట్లు పెరుగు తున్నాయి.
2. కూలీరేటు పెరగడం.
3. పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర దక్కడం లేదు.

4. డీజిల్ రేట్లు పెరిగినందువల్ల ట్రాక్టర్ బాడుగలు, రవాణాఖర్చులు పెరిగాయి.
5. పెట్టుబడికన్నా ఆదాయం తక్కువగా ఉండటంతో అప్పు చెల్లించలేని పరిస్థితి.
6. కాలువలకు సకాలంలో నీరు విడుదల కాకపోవడం.
7. డ్రైన్‌ల మరమత్తుల గురించి పట్టించుకోని ప్రభుత్వం.

ప్రభుత్వం గత 10-15ఏళ్ళుగా అనుసరిస్తున్న లోపభూయిష్ట వ్యవసాయ విధానాలే రైతుల ప్రస్తుత దుస్థితికి మూలకారణాలు. కేంద్రం ఇటీవల కాలంలో తెచ్చిన, తెస్తున్న చట్టాలు రైతులకు ఎంతమాత్రం ప్రయోజనం చేకూర్చడం లేదు.

1. మార్కెట్ కమిటీల చట్టం – 2005
2. భవిష్య వాణిజ్య చట్టం – 2008
3. ఎఫ్‌డిఐ చట్టం – 2005
4. నిబంధనలు, పేటెంట్ల చట్టం – 2005
5. పోషకాధార ఎరువుల ధరల విధానం
6. కనీస మద్దతు ధరల విధానం
7. ఆహార సేకరణ విధానం

కొద్దిమంది రైతులు దాదాపు లక్ష ఎకరాల పంటకు విరామం ఇచ్చారని మొత్తం వరిసాగు భూమిలో అది ఒక్కశాతం మాత్రమే కనుక దానికి ప్రభావం పెద్దగా ఉండదని తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ప్రభుత్వ విధాన రాహిత్యం, చేతకాని తనం పుణ్యమా అని ఈ ధోరణి రైతుల్లో విస్తరిస్తుంది. పంట విరామం వల్ల ఈ ఏడాది దాదాపుగా 3లక్షల టన్నుల వరిధాన్యం కోల్పోవలసి వస్తుంది. ముఖ్యంగా చిన్న సన్నకారు రైతుల జీవితం దుర్భరం అవుతుంది.

రైతులను ప్రజానీకానికి ఆహారాన్ని, పరిశ్రమలకు ముడిసరుకులను ఉత్పత్తి చేసే రోబోట్లుగా మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమ జీవనోపాధిని పొందుతూ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటునిచ్చే రంగంలో ఉన్న మనుషులుగా వారిని పరిగణించడం లేదు.

అన్ని పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ఎందుకు తొక్కిపెడుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు న్యాయమైన లాభసాటి ధర రాకుండా ఎందుకు చేస్తున్నారు.

పంటవిరామంతో ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని తన వ్యవసాయ విధానం సవరించుకొని రైతులను కాపాడేందుకు సిద్దం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలలో నాట్లకు ముందే కనీస మద్దతు ధరపై 400 రూపాయల బోనస్‌గా ప్రకటించి ప్రతి క్వింటాలుకు రూ॥1500 వరకు వచ్చే విధంగా చూడాలి. ఎఫ్.సి.ఐ, ఎ.పి.సి.ఎస్.సి, మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వరంగ సంస్థల ద్వారా 65 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తే బోనస్‌వల్ల సుమారు 2300 కోట్లు మాత్రమే ప్రభుత్వానికి భారం పడుతుంది. ధాన్యాన్ని మిల్లర్లనుండి కొనుగోలు చేసే బదులు పంజాబ్, హర్యానా, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు చేస్తున్నట్లు రైతుల నుండి నేరుగా ఎఫ్.సి.ఐ. కొనేవిధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి.

తాత్కాలిక అవసరాలతో కూడిన ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం మీద ఆధారపడిన 60% ప్రజలు పేదరికంలో మగ్గిపోతుంటే దేశం ప్రగతి సాధించలేదు. పల్లెలో వ్యవసాయ రంగంలో ఉన్న రైతు తలసరి ఆదాయం రూ॥15000 ఉంటే అదే పట్టణ ప్రాంతంలో వ్యవసాయేతర రంగంలో ఉన్న వ్యక్తి తలసరి ఆదాయం రూ॥ 105000 ఉంది. రాబోయే 10 ఏళ్ళల్లో గ్రామీణ ప్రాంతాలలో వారి కంటే పట్టణాలవారీ ఆదాయం 16 లేదా 17 రెట్లు పెరుగుతుంది. ఈ తీవ్ర అసమానతలు దేశాభివృద్ధిని దెబ్బతీయడమే కాకుండా సమగ్రతకు ప్రమాదకరంగా పరిణమిస్తాయి.

ప్రభుత్వం తప్పుడు కారణాలు చూపి ధరలను దెబ్బతీయకుండా సరఫరా డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌ధరలు లభించేలా అనుమతులు ఇవ్వాలి. ప్రపంచంలో ఏ మూలకైనా తన ఉత్పత్తిని అమ్ముకొనే స్వేచ్ఛను రైతుకు కల్పించాలి. దాని అర్థం ప్రభుత్వం పేదల, నిస్సహాయుల ఆహారభద్రత గురించి పట్టించుకోకూడదని కాదు. రైతులకు లాభసాటి ధరనిచ్చి ప్రభుత్వం ఆహారధాన్యాన్ని సేకరించి ఆహారభద్రతను కల్పించాలి.

ధరల పెరుగుదలకు కారణమంటూ దేశంలో ఎవరు ఆత్మహత్య చేసుకోలేదు. కానీ గత 10ఏళ్ళ కాలంలో వ్యవసాయం ఏ మాత్రం గిట్టుబాటుకాక తీవ్రనష్టాలతో అప్పుల్లో కూరుకుపోయి 10లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిని ప్రభుత్వాలు విస్మరించకూడదు. కేవలం లెవీ బియ్యం మీద వ్యాట్ ద్వారా ఈ ప్రభుత్వానికి ఏటా 1500 కోట్లు ఆదాయం వస్తున్నది. ◆

# "కందా" సిఫారసులు : రైతుకు దక్కని భరోసా



తూర్పుగోదావరి జిల్లాలో పంటవిరామం ప్రకటించి నిరసన తెలిపిన రైతులను ఆదుకునేందుకు ఏం చేయాలో చెప్పమని కోరుతూ మోహన్ కందా కమిటీని ప్రభుత్వం నియమించింది. కందా సిఫారసులు రైతులకు భరోసా ఇచ్చేవిగా లేనట్లు కనిపిస్తున్నది. నివేదికను ప్రభుత్వం అధికారికంగా ఇంకా విడుదల చేయలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం పేరుతో పత్రికలలో వచ్చిన వార్తలలోని ముఖ్యాంశాలు.

- పంట విరామం ప్రకటించిన రైతులకు తక్షణం ఆర్థికసాయం చేయాలన్న డిమాండుపై కమిటీ సానుకూలంగా స్పందించలేదని సమాచారం. ఈ విధంగా ఆర్థికసాయం ప్రకటిస్తే ఇతర ప్రాంతాల్లో అనేక కారణాల వల్ల పంటలు సాగు చేయలేకపోయిన రైతులు కూడా పరిహారం అడిగే అవకాశం ఉంటుందని, దీనివల్ల సర్కారుపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని భావించినట్లు తెలిసింది.
- ఇటీవల అమల్లోకి వచ్చిన కౌలు రైతు రక్షణ చట్టం కారణంగా కొన్ని ప్రాంతాల్లో భూయజమానులు పొలాలను బీడుగా ఉంచడానికైనా సిద్ధపడుతున్నారుగానీ భూములను కౌలుకు ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నారు .దీనివల్ల పంటల సాగు సాధ్యపడటం లేదు. ఇలాంటి భూములను కూడా పంట విరామం కింద చూపుతున్నారని కమిటీ అభిప్రాయపడింది.
- మద్దతు ధర చాలా తక్కువగా ఉండటం వల్లనే వరిసాగుతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్న దాంట్లో నిజముంది. రాష్ట్రంలో వరిసాగు వ్యయంతో పోలిస్తే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర చాలా తక్కువ. సాగు వ్యయాన్ని శాస్త్రీయంగా లెక్కించి దానిపై కొంచెం అధికంగానైనా మద్దతు ధరను ప్రకటించాలి. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవసాయ అభివృద్ధికి పనిచేయాలి.
- మిల్లర్లు ప్రస్తుతం 75 శాతం బియ్యం లెవీ ఇచ్చి 25 శాతం బియ్యం బయట విక్రయిస్తున్నారు. దీన్ని 50, 50 శాతంగా మార్చాలి. దీనివల్ల మార్కెట్లో బియ్యం అమ్ముకోవడానికి మిల్లర్లకు అవకాశం లభిస్తుంది. ఫలితంగా ధాన్యం ధరలు పెరిగి రైతుకు ప్రయోజనం చేకూరుతుంది.
- ఏటా మే 15 నాటికి కాల్వలకు నీరు వదలాలి. ఇది జరగాలంటే 45 రోజుల ముందే అంటే ఏప్రిల్ ఒకటి కల్లా నీరు నిలిపివేయాలి. ఈ విధంగా 45 రోజుల అంతరం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. దీనిపై జిల్లా నీటి పారుదల మండలిలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి.
- సరిపోయినన్ని గోదాములు లేకపోవటమన్నది ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రతి మండలంలో తప్పనిసరిగా గోదాములు ఉండేలా కొత్త నిర్మాణాలు చేపట్టాలి. తూర్పుగోదావరి జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- రైతులంతా మూకుమ్మడిగా వరి సాగుచేయడం వల్ల దిగుబడులు అధికమై ధరలు పడిపోతున్నాయి. ఈ పరిస్థితిని నివారించటానికి పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించాలి. వరి నుంచి ఇతర పంటల వైపు రైతులను మళ్లించాలి. ఇతర పంటలు సాగు చేయడం వల్ల రైతులకు నష్టాలు వచ్చే అవకాశాలు కూడా తక్కువే.
- బియ్యం ఎగుమతులపై ప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకోవాలి. రైతులు ధాన్యం అంతా అమ్ముకున్నాక ఎగుమతులను అనుమతించడం వల్ల వారికి మేలు జరగడం లేదు. ధాన్యం కొనుగోళ్లు మొదలైన వెంటనే దిగుబడుల అంచనాని బట్టి ఎగుమతులకు అనుమతిస్తే ధర పెరిగి రైతులకు లాభం చేకూరుతుంది. ◆

**కొన్ని ముఖ్య సిఫార్సులు**

- సాగువ్యయంకన్నా మద్దతు ధర అధికంగా ఉండాలి
- మే 15 కల్లా కాల్వలకు నీరొదలాలి
- లెవీని 50 శాతానికి పరిమితం చేయాలి
- తక్షణ పరిహారం అవసరం లేదు

# రాష్ట్రంలో భూ కేటాయింపుల కొత్త విధానం

**రాష్ట్రంలో సెజ్‌ల పేరుతో, పవర్‌ప్లాంట్ల పేరుతో, పోర్టుల పేరుతో గత దశాబ్దకాలంలో భూపందేరాలు యధేచ్ఛగా సాగిపోయాయి. ఇందులో అభివృద్ధి పాలు కంటే అవినీతి నీళ్లే అధికంగా వున్నాయి. అధికార దుర్వినియోగంతో, స్వప్రయోజనాల కోసం ఈ పందేరాలు జరిగాయి. ఇప్పుడు ప్రభుత్వం ఈ భూపందేరాలపై ఒక సమగ్రమైన విధానంతో ముందుకు రాకుండా కేవలం భూముల కేటాయింపులకు మార్గదర్శకాలకే పరిమితం అయింది. ఇది ఒక ముందడుగు కాని సమగ్రం కాదు. పరిపూర్ణమూ కాదు. ఈ భూముల కేటాయింపుకు ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల అథారిటీ వుండాలి. దేనికి ఎంత భూమి అవసరం - ఎక్కడ అనువైనదీ అన్నది తేల్చడానికి - రైతులకు ఇచ్చే పరిహారం, నిర్వాసితులకి ఇచ్చే పరిహారం, పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా తీసుకోవలసిన చర్యలన్నింటినీ అది పర్యవేక్షించాలి. ఇవన్నీ పూర్తిగా నెరవేరిన తర్వాతే భూముల అప్పగింతలు అక్కడ నిర్మాణాలు జరగాలి. పరిహారం రైతులకు, నిర్వాసితులకు ఇప్పటికంటే మంచి భవిష్యత్తుని ఇచ్చేదిగా రూపొందించాలి. వీటిని గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కేవలం భూముల కేటాయింపుకు మాత్రమే పరిమితం కావడం వల్ల ఇది నిర్వాసితుల్ని సంతృప్తిపరచదు. అందుచేత ప్రభుత్వం సమగ్రమైన భూసేకరణ, కేటాయింపు విధానాన్ని ప్రకటించాలి. ఇప్పుడు ప్రభుత్వం తలపెట్టిన భూకేటాయింపుల విధానంలో ఈక్రింది అంశాలున్నాయి.**

- భూమి కేటాయింపునకు ఖచ్చితమైన నిబంధనలు లేకపోతే అంతర్జాతీయ ప్రమాణాలను పరిగణలోకి తీసుకోవాలి. ఇందులో కూడా బంజరు భూములను కేటాయించాలి తప్ప, మాగాణి, సాగునీటి వసతి ఉన్న భూములను కేటాయించరాదు.
- భూ కేటాయింపుపై సంబంధిత శాఖకు ప్రతిపాదన వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం ఉందా, సరైన సంస్థేనా అన్నది ధ్రువీకరించి జిల్లా కలెక్టర్‌కు పంపాలి. కలెక్టర్ పరిశీలించి తన అభిప్రాయంతో రాష్ట్ర భూ నిర్వహణ అథారిటీ (ఎ.పి.ఎల్.ఎం.ఎ)కి పంపాలి.
- పరిశ్రమలు, ఐ.టి, విద్యుత్తు, మౌలిక సదుపాయాలు తదితర విభాగాలకు ఏ పరిశ్రమకు ఎంత భూమి అవసరం, ఎలాంటి నిబంధనలు పాటించాలనేది ముందుగానే నిర్ణయించాలి.
- భూమి ధరను నిర్ణయించేటప్పుడు ఎందుకోసం కేటాయిస్తున్నాం, ఎలాంటి సంస్థకు కేటాయిస్తున్నామన్న దానిని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ భూములు స్వచ్ఛంద సంస్థలకు కేటాయించినపుడు తప్ప మిగిలిన అన్ని సందర్భాల్లో కలెక్టర్, ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు చేసే మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలి.

  ఇప్పటికే కేటాయించిన భూములకు సంబంధించి సమీక్షించే అధికారం భూ నిర్వహణ అథారిటీకి ఉంటుంది.
- కేటాయించి వినియోగించని భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకొంటే ఆ భూములను ప్రభుత్వం వద్ద ఉంచుకొని ప్రజాప్రయోజనాలకు అవసరమైన సంస్థలకు తిరిగి కేటాయించవచ్చు.
- 2005లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పునరావాస విధానాన్ని అమలు చేస్తారు.
- ఏపీఐఐసీ ప్రైవేటు భూములను సేకరించి ప్రైవేటు సంస్థలకు కేటాయించడం కూడా కొత్త భూ కేటాయింపు ప్రకారం జరగాలి. ఇందులో మార్పులుంటే భూ నిర్వహణ అథారిటీ అనుమతి తీసుకోవాలి.
- భూ కేటాయింపులకు సంబంధించి ముఖ్యమంత్రికి, మంత్రులకు దరఖాస్తులు వస్తే సంబంధిత శాఖలకు పంపి ప్రాసెస్ చేయించాలి.
- డి.పి.ఆర్ ఆధారంగా అవసరమైన భూమి, పెట్టుబడి, ఉద్యోగావకాశాలు, మౌలికసదుపాయాలు, పర్యావరణంపై ప్రభావాన్ని పరిగణలోకి తీసకొని ప్రభుత్వం ఏపీఐఐసీకి భూమిని కేటాయించాలి. ఈ భూమికి ధరను రెవిన్యూశాఖ నిర్ణయిస్తుంది.
- ఏ పరిశ్రమకు ఎంత భూమి అవసరం, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, విద్యుత్తు ప్రాజెక్టులకు ఎంత అవసరమవుతుందో కూడా ఓ నిర్ధారణకు వచ్చి ముసాయిదాలోనే పొందుపరిచారు. ◆

# పాఠశాల విద్యలో ప్రమాణాలు

## ప్రోత్సాహకాలతో ప్రారంభించండి... జరిమానాలతో కాదు

మన రాష్ట్రప్రభుత్వానికి పాఠశాల విద్యని సంస్కరించాలన్న తలంపురావడం ఆహ్వానించదగిన పరిణామం. కాని రాష్ట్రం ప్రభుత్వం ఎప్పుడు ఏ సంస్కరణని తలపెట్టినా అది అనాలోచితగా లేదా అరకొర చర్యలతో ప్రారంభమై ఆదిలోనే ఆగిపోవడం పరిపాటి అయింది.

మనకి పాఠశాలలున్నాయి. ఉపాధ్యాయులున్నారు కాని చలా చోట్ల పిల్లలు వేరు. దీనిని రేషనలైజేషన్ ద్వారా చక్కదిద్దుతానని ప్రభుత్వం హడావిడి చేసింది. ఉపాధ్యాయుల్ని ప్రజాప్రతినిధుల్ని, అధికారుల్ని కూర్చోబెట్టి ఒక హేతుబద్ధమైన విధానాన్ని రూపొందించి అమలు చేయలేక పోయింది. పిల్లలున్న చోట ఉపాధ్యాయులు లేకుండా, ఉపాధ్యాయులున్న చోట పిల్లలు లేకుండా పాఠశాల చదువు సాగిపోతున్నది.

ఈ పాఠశాలలకు పిల్లల్ని ఆకర్షించడానికి ఇంగ్లీషును బోధనాంశం చేస్తామని ప్రకటించింది. దానికి చాలా హడావిడి చేసింది. కాని దానిని అమలు చేయలేక చేతులెత్తేసింది.

పాఠశాలలో పిల్లల చదువుని మదింపుచేసే ఏ పరీక్షా పద్ధతి లేకుండా చేసింది. ఇప్పుడు పిల్లల విద్యాస్థాయిని పరీక్షించి దాని ఆధారంగా జరిమా నాలు విధిస్తా మని అర్ధరాత్రి వచ్చిన ఆలోచనని తెల్లవారగానే ప్రకటించి అమలు చేస్తామని ప్రకటించింది. దీనికి ఒక స్వతంత్రమైన వ్యవస్థ కావాలి. విద్యార్థుల చదువుస్థాయిని అంచనా వేసే అబ్జక్టివ్ పద్ధతిని రూపొందించాలి. ఇవేమీ లేకుండా ప్రకటనలు చెయ్యడం ఉపసంహరించుకోవడం ఈ ప్రభుత్వానికి ఆనవాయితీ అయింది.



అలాగే పాఠశాల విద్యలో హైస్కూలు విద్యను 12వ తరగతి వరకు పొడిగించాలని తలపెట్టింది. సి.బి.యస్.సి. సిలబస్‌ను తేవాలని భావించింది. ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా అమలుచేసి తర్వాత వదిలేసింది.

ఇప్పుడు పాఠశాల విద్యలో ప్రమాణాల మీద చేస్తున్న ప్రయత్నం మంచిదే అయినా ప్రభుత్వ తొందరపాటు వల్ల బెడిసికొట్టే అవకాశాలే ఎక్కువగా వున్నాయి.

అందుచేత ముందుగా ప్రతిపాఠశాలలో 5 మంది ఉపాధ్యాయులు తగినంత మంది పిల్లలు వుండేలా రేషనలైజ్ చెయ్యండి. ఇంగ్లీషు బోధనకు ఏర్పాట్లు చెయ్యడం, విద్యార్థులను పరీక్షించే ప్రత్యేక యంత్రాంగాన్ని నిష్పాక్షిక పద్ధతిని రూపొందించండి. అప్పుడు ఇలాంటి ప్రయోగాలు ప్రారంభించండి. అది కూడా ప్రోత్సాహకాలతో ప్రారంభించండి – ఓచరు పాఠశాలలకు ద్వారాలు తెరవండి. తల్లిదండ్రులకు పాఠశాలలను ఎంచుకునే స్వేచ్ఛ కల్పించండి. ఇవన్నీ లోతుగా పరిశీలించి, పథకాన్ని, విధానాలను రూపొందించి అమలుచేస్తే సత్ఫలితాలు వస్తాయి. ఈ నేపధ్యంతో ప్రభుత్వం తలపెట్టిన

పథకాలలోని అంశాలను పాఠకుల సౌకర్యార్థం సంక్షిప్తంగా అందిస్తున్నాం.

**విద్యార్థి పనితీరు 60 శాతానికి తక్కువగా ఉంటే టీచర్లకు జరిమానా.. 90 శాతం దాటితే నజరానా - సర్కారు నోటిఫికేషన్**

విద్యార్థి సరిగ్గా చదవకపోతే ఇక టీచర్లదే బాధ్యత. మామూలు చదువు కాదు... కనీసం ఫస్ట్ క్లాస్ ప్రమాణాలు ఉండాలి. లేదంటే బాధ్యులైన ఉపాధ్యాయులకు జరిమానా తప్పదు. అదే సమయంలో పిల్లలు భేషుగ్గా రాణిస్తే నజరానా కూడా ఉంటుంది. ఇవీ రాష్ట్ర ప్రభుత్వ తాజా నిబంధనలు, రాజీవ్ విద్యామిషన్ పంపిన ప్రతిపాదనల మేరకు పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. విద్యాహక్కు చట్టంలోని మార్గదర్శకాలతో గతంలో జారీ చేసిన జీవోకు అదనంగా ఈ కొత్త నిబంధనలు చేర్చి తాజా జీవో (ఎం.ఎస్. 130) తో సర్కారు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ గెజిట్‌లో ఈ నోటిఫికేషన్‌ను ముద్రించాలని జీవోలో సూచించారు. మరో పక్క విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదుల పరిష్కారానికి గ్రామ పంచాయితీ, మండల జిల్లా, రాష్ట్ర స్థాయిలో అప్పిలేట్ అథారిటీలనూ ఖరారు చేశారు.

## ఇవీ కొత్త నిబంధనలు...

- తమ సబ్జెక్టు పరిధిలో లేదా క్లాస్‌రూమ్ పరిధిలో విద్యార్థుల పనితీరు బాగా లేకపోతే టీచర్లే బాధ్యత వహించాలి. రాష్ట్ర అకడమిక్ అథారిటీ నిర్దేశించిన ప్రమాణాల మేరకు విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తారు.
- విద్యా సంవత్సరం చివరలో తరగతి లేదా సబ్జెక్టులో విద్యార్థి పనితీరు 60 శాతం కంటే తక్కువగా ఉన్నట్లయితే అందుకు క్లాస్ టీచర్ లేదా విద్యా సంవత్సరం మొత్తానికి పనిచేసిన సదరు సబ్జెక్టు టీచర్ లేదా విద్యా సంవత్సరంలో ఎక్కువ కాలం ఈ సబ్జెక్టు బోధించిన టీచర్‌కు జరిమానా విధించేలా స్థానిక అధికారులు పై అధికారులకు సిఫారసు చేయవచ్చు.
- అదే సమయంలో విద్యా సంవత్సరం చివరలో తరగతి లేదా సబ్జెక్టులో విద్యార్థి పనితీరు 90 శాతం కంటే ఎక్కువ ఉన్నట్లయితే క్లాస్ టీచర్ లేదా విద్యా సంవత్సరం మొత్తానికి పనిచేసిన సబ్జెక్టు టీచర్ లేదా విద్యా సంవత్సరంలో ఎక్కువ కాలం ఈ సబ్జెక్టు బోధించిన టీచర్‌కు 'బెస్ట్ టీచర్' అవార్డుకు స్థానిక అధికారులు సిఫారసు చేయవచ్చు. అయితే సదరు టీచర్‌పై ఎలాంటి ఫిర్యాదులు ఉండరాదు.
- విద్యా హక్కు చట్టంలోని 17 (1) విభాగంలో పొందుపర్చిన నియమాలు ఉల్లంఘించినట్లయితే దాన్ని ప్రవర్తనానేరంగా పరిగణించి భారీ అపరాధ రుసుము విధిస్తారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి వివిధ స్థాయిల్లో కమిటీలు

- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇతరుల ఫిర్యాదులకు ప్రాథమిక స్థాయిలో గ్రామ పంచాయితీనే పరిష్కార కేంద్రంగా వ్యవహరిస్తుంది.
- గ్రామ పంచాయితీ ఆదేశాల్ని అనుసరించి మండలస్థాయిలో ఒక కమిటీని నియమిస్తారు. మండలాధ్యకుడు ఛైర్మన్‌గా ఉంటే, ఈ కమిటీలో మండలా భివృద్ధి అధికారి సభ్యుడిగానూ, మండల విద్యాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీనే అప్పిలేట్ అథారిటీగా వ్యవహరిస్తుంది.
- జిల్లా స్థాయిలోనూ ఇదేవిధంగా అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈఓ, రాజీవ్ విద్యామిషన్ అధికారి, పలు ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. డీఈఓ కన్వీనర్‌గా ఉంటారు.
- ఇదేవిధంగా రాష్ట్రస్థాయి అప్పిలేట్ అథారిటీలో ప్రాథమిక విద్యాశాఖ, పాఠశాల విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులు, రాజీవ్ విద్యామిషన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, పాఠశాల విద్య డైరెక్టర్‌లు సభ్యులుగా ఉంటారు.

## తల్లిదండ్రులకే నిర్వహణ కమిటీ ఎన్నిక బాధ్యత

- పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల ఎంపిక బాధ్యతల్ని విద్యార్థుల తల్లిదండ్రులకే అప్పగించారు. కమిటీలో ఆరుగురు తల్లిదండ్రులు కూడా సభ్యులుగా ఉంటారు. వీరిని విద్యార్థుల తల్లిదండ్రులే నోటిమాట లేదా చేతులెత్తి లేదా రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నుకోవాలి. రిజర్వేషన్ ప్రకారం వీరిలో ఇద్దరు పేరెంట్ సభ్యులను జనరల్ కేటగిరి నుండి, నలుగురు సభ్యులను బీసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుండి ఒక్కొక్కరిచొప్పున ఎన్నుకోవాలి. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరిలో సగం మంది మహిళలై ఉండాలి. కమిటీ సభ్యుల ఎన్నిక విధానంపై తల్లిదండ్రులకు రాతపూర్వకంగా తెలియపర్చి, ఎన్నికల నిర్వహణపై చర్చించి ప్రక్రియ పూర్తిచేయాలి. ◆

# పట్టణ జనాభా పెరగాలి - వికృతంగా కాదు

## రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

దేశంలో, రాష్ట్రంలో పట్టణ జనాభా పెరుగుదల పరుగులు తీస్తుందంటూ పత్రికలలో వచ్చిన వార్త సంతోషాన్ని కలిగించేదే అయినా, ఈ పెరుగుదల ఆశించినంతగా లేదు. అంతకుమించి ఈ కొద్ది పెరుగుదల వికృత రూపంలో వుంది.

మన రాష్ట్రంలో హైదరాబాద్ పట్టణ జనాభా ఒక్కటే ఉరకలు పరుగులు పెడుతున్నది. విశాఖపట్టణంలో కొంత కనిపిస్తున్నది. ఇలా ఒకటి రెండు పట్టణాలే పెరగడం అభివృద్ధిగా కనిపించినా అది అనర్థదాయకం.

మనకి చిన్న పట్టణాలు పెరగాలి - రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాలు వస్తే అది గ్రామీణ జనజీవనాన్ని మార్చివేస్తుంది. దీనిని ప్రభుత్వం ఒక పథకం ప్రకారం అభివృద్ధి చెయ్యాలి. గ్రామీణ ప్రాంతాలలో అర్బన్ సౌకర్యాలు హెచ్చుమందికి అందడానికి వీలుకలుగుతుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి, ప్రజలకు మంచిప్రమాణాల విద్య, ఆరోగ్యసౌకర్యాలు అందించడం వీలవుతుంది.

| | 2001 | 2011 |
|---|---|---|
| పట్టణ జనాభా శాతం | 27 | 33.49 |
| గ్రామీణ జనాభా శాతం | 73 | 66.51 |
| **వెయ్యి మంది పురుషులకు మహిళలు** | | |
| గ్రామాల్లో | 983 | 995 |
| పట్టణాల్లో | 965 | 984 |
| **పురుషులు, మహిళల మధ్య అక్షరాస్యత వ్యత్యాసం శాతం** | | |
| గ్రామాల్లో | 19.85 | 18.19 |
| పట్టణాల్లో | 14.45 | 10.97 |
| **మహిళల్లో అక్షరాస్యుల శాతం** | | |
| గ్రామాల్లో | 43.50 | 52.05 |
| పట్టణాల్లో | 68.74 | 75.02 |

### ◆జాతీయస్థాయి కంటే పెరుగుదల ఎక్కువ

రాష్ట్రంలోని పట్టణాల్లో పదేళ్లలో జనాభా గణనీయంగా పెరిగింది. తాజా గణాంకాల ప్రకారం. రాష్ట్రంలో పట్టణ జనాభా పెరుగుదల జాతీయస్థాయి కంటే ఎక్కువగా ఉంది. 2010-11లో రెండు దశలుగా సేకరించిన జనాభా లెక్కల నుంచి పట్టణ, గ్రామీణ జనాభా వివరాలను క్రోడీకరించారు. అందులోని ముఖ్యాంశాలు.

**ప్రస్తుతం రాష్ట్ర జనాభా 8,46,65,533**

**గ్రామీణ జనాభా 5,63,11,788**

**పట్టణ జనాభా 2,83,53,748**


- ◆ వెయ్యిమంది పురుషులకు గ్రామాల్లో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 1047 మంది, రంగారెడ్డిజిల్లాలో 968 మంది మహిళలున్నారు.
- ◆ వెయ్యిమంది పురుషులకు పట్టణాల్లో అత్యధికంగా విజయనగరం జిల్లాలో 1037 మంది. హైదరాబాద్ జిల్లాలో 943 మంది మహిళలు ఉన్నారు.
- ◆ ఆరేళ్లలోపు బాలలు గ్రామీణ ప్రాంతాల్లో 10.39 శాతం కాగా పట్టణాల్లో 9.84 శాతం ఉన్నారు. అన్ని జిల్లాల్లో గత పదేళ్లలో ఆరేళ్లలోపు బాలల శాతం తగ్గింది.
- ◆ గ్రామీణ బాలల్లో వెయ్యి మంది బాలురకు బాలికల సంఖ్య పశ్చిమ గోదావరి తప్ప అన్ని జిల్లాల్లో తగ్గింది.
- ◆ పట్టణ బాలల్లో 3 జిల్లాలు తప్ప మిగతా అన్ని జిల్లాల్లో బాలికల సంఖ్య తగ్గింది.
- ◆ రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 67.66
- ◆ గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత శాతం 61.44
- ◆ పట్టణాల్లో అక్షరాస్యత శాతం 80.54
- ◆ రాష్ట్రంలో హైదరాబాద్ ఒక్కటే పూర్తిగా పట్టణ జనాభా ఉన్న జిల్లా. ఇతర జిల్లాలను పరిశీలిస్తే... రంగారెడ్డి జిల్లాలో 70.32 శాతం పట్టణ జనాభా ఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలో 15 శాతమే ఉన్నారు.

జిల్లాలవారీ వివరాలతో పుస్తకం విడుదల : జిల్లాల వారీగా జనాభా వివరాలతో పుస్తకం రూపొందించినట్లు జనాభా లెక్కల రాష్ట్ర సంచాలకురాలు వై.వి.అనూరాధ తెలిపారు. తమ కార్యాలయంలో రూ॥75 చెల్లించి ఈ పుస్తకాన్ని పొందొచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబరు 040 24750421 ఎక్స్‌టెన్షన్ 38లో సంప్రదించాలని సూచించారు. ◆

# నిష్కళంక రాజకీయవేత్త నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత

- గుముడాల చక్రవర్తి గౌడ్

**ప్రజాసేవే పరమావధిగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడాయన. సంపాదించే అవకాశమున్నా న్యాయవాద వృత్తిని సైతం తృణప్రాయంగా వదిలేసి స్వాతంత్రోద్యమంలో చురకైన పాత్రను పోషించిన యోధుడు విద్యాసంస్థల స్థాపనకు కృషిచేసిన విద్యాభిమాని, మహబూబ్‌నగర్ నియోజకవర్గం తొలి శాసన సభ్యులుగా ప్రజాభిమానం చూరగొన్న నేత, పల్లెర్ల హను మంతరావు.**



**దక్కన్ గాంధి**
**తెలంగాణా కేసరి**
**పల్లెర్ల హనుమంతరావు**

''తెలంగాణా కేసరి'', "దక్కన్‌గాంధీ" గా బిరుదులందు కున్నారు. ఏ పదవి చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చారు. అలాంటి మహనీయుణ్ణి స్మరించుకోవడం ఎంతో అవసరం. 1908లో జన్మించిన పల్లెర్ల హనుమంతరావు లా కోర్సు పూర్తిచేసి కొంతకాలం న్యాయవాదిగా సేవలందించారు. గాంధీజీ పిలుపుమేరకు న్యాయవాద వృత్తిని వదిలిపెట్టి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. తోటి యువకులను వెంట పెట్టుకొని నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. కానీ ముస్లింలను ఎన్నడూ ద్వేషించలేదు. రజాకార్లపై వ్యతిరేకతతో స్థానిక ముస్లింలపై దాడులు జరిగిప్పుడు పట్టణంలోని ముస్లింలు పల్లెర్ల హన్మంతరావు ఇంట్లో ఆశ్రయం పొందారంటే ఆయన మానవతా విలువలకిచ్చిన ప్రాధాన్యత ఏమిటో అర్ధమవుతుంది.

**ఒకే వేదికపై ప్రత్యర్ధితో కలిసి....**

**గాంధీజీ ఆశయాలమేరకు గ్రామీణ పరిశ్రమలకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో ఖాదీట్రస్ట్ స్థాపించారు. దీనికోసం 5 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు.** : రాజకీయ ప్రత్యర్ధులపై దుమ్మెత్తి పోయడమే నేటి రాజకీయ నాయకుల వంతైతే నాడు పల్లెర్ల హనుమంతరావు మెదక్ స్థానం నుంచి ఎంపీగా పోటీచేసిన సందర్భంలో తన ప్రత్యర్ధి మగ్దుం మొహినుద్దీన్‌తో కలిసి ఒకే వేదిక మీది నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించడం విశేషం. పదిమంది జేబుల్లోని డబ్బులు తన జేబుల్లోకి రావాలని ఆశించే నేటి నేతలు తన జేబులోని డబ్బులను పదిమందికి పంచిన నిస్వార్ధ, నిష్కళంక నేత పల్లెర్ల హనుమంతరావును ఆదర్శంగా తీసుకోవాలి. ప్రజాసేవే పరమావధిగా కృషిచేయాలి.

1940 నుండి 52 వరకు పన్నెండేళ్ళపాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారు. 1952లో మహబూబ్‌నగర్ నియోజకవర్గం తొలి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 1954లో రెవిన్యూ, ఎక్సైజ్, ఎండోమెంట్, ఫారెస్ట్ శాఖల సహాయమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1957లో మెదక్ లోక్‌సభ స్థానం నుంచి

ఎన్నికయ్యారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు మగ్దూం మొహినొద్దీన్‌పై 25వేల మెజార్టీతో గెలుపొంది సంచలన సృష్టించారు. 1967లోనూ మెదక్ స్థానం నుంచి రెండవసారి గెలుపొందారు. గాంధీజీ ఆశయాలమేరకు గ్రామీణ పరిశ్రమలకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో ఖాదీట్రస్ట్ స్థాపించారు. దీనికోసం 5 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. 1964 వరకు ఇందులో అంబర్ చరఖా, నూనెల తయారీ (గానుగ), దంపుడు బియ్యం, స్వదేశీ సబ్బుల తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నడిపారు. 1965లో మహబూబ్‌నగర్ విద్యాసమితి పేరిట జిల్లా కేంద్రంలో విద్యాసంస్థను నెలకొల్పారు. ఇదే విద్యా సంస్థ నేడు ఎం.వి.ఎస్. కళాశాలగా రూపాంతరం చెంది వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లా విద్యా సుగంధాలను వెదజల్లుతున్నది. భారత సేవక్ సమాజ్ జిల్లా ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన పల్లెర్ల హనుమంతరావు జిల్లాలో పర్యటించినప్పుడు, పండిట్‌నెహ్రూ జిల్లాను సందర్శించిన సందర్భంలో వారి వెన్నంటి ఉండి కార్యక్రమాలను విజయవంతం చేశారు. కొత్తవారికి అవకాశ మివ్వాలన్న ఉద్దేశంలో ఒకసారి పార్లమెంటు సభ్యునిగా కొనసాగిన తర్వాత రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించారు. వినోబాభావే సూచన మేరకు రెండోసారి మెదక్ స్థానం నుంచి పోటీచేసి గెలుపొందారు. నైతిక విలువలకు కట్టుబడి, నిబద్ధత కలిగిన రాజకీయవేత్తగా ఏది చేసినా ముందుచూపుతోనే చేశారు. వనపర్తి సంస్థానాధీశులతో మాట్లాడి మహబూబ్‌నగర్‌లో పాలిటెక్నిక్ కళాశాల కోసం స్థలం ఇప్పించడం ఆయన ముందుచూపుకు నిదర్శనం. 1932–33లో పాత పాలమూరులో హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించారు. తన సహచరుడు నందగిరి వెంకట్రావ్‌తో కలిసి సత్యాగ్రహం చేశారు. ◆

ప్రతులకు :

**పల్లెర్ల హనుమంతరావు**
**శత జయంతి ఉత్సవ కమిటీ**

**పల్లెర్ల హనుమంతరావు భవన్,**

**న్యూ టౌన్**

**మహబూబ్ నగర్ - 509 001**

# ప్రజా ఋషి

**- జి. వెంకటేశ్వర్లు**

పల్లెరు గాయల్లాంటి ప్రజాసమస్యలను
మల్లెపువ్వుల్లా స్వీకరించినవాడు
పల్లెర్ల వంశవృక్షంలో నవ పల్లవాలు పూయించినవాడు
ఎవ్వడు గాంధీ ప్రక్కన నిలవగలిగినవాడు?
ఇంకెవ్వడు? "దక్కన్‌గాంధీ"
హనుమంతరావు అతడు

బ్రాహ్మణుడాతడు- బ్రహ్మజెముడులాంటి
సనాతనాచారాలను మంటగలిపిన
ఆధునాతను డాతడు.

నిజాం ఘోరకిరాతక చర్యలను ప్రతిఘటించి,
కారాగార క్లేశమనుభవించిన కర్మశీలీ అతడు.

మహబూబ్‌నగర్ జిల్లాకు మకుటంలేని నాయకుడైనా
స్వార్థమెరుగని పార మార్థికు డాతడు.

మంత్రియైనా, యం.పి.యైనా,
మరి ఏదైనా రాజకీయ మలినమంటని
రాజర్షి అతడు, బ్రహ్మర్షి అతడు.
పదవిలో ఉండి పేరు తెచ్చుకొననివాడు
తన పేరుతో పదవికి పేరు తెచ్చినవాడు.
పెళ్ళాం పిల్లలకోసం ఏ పెత్తనం చేపట్టనివాడు.
టెండర్లు పెట్టనివాడు, పర్మిట్లు కొట్టనివాడు
బంగళాలు కట్టనివాడు, భూములు కొననివాడు
ఉద్యోగాలిప్పిస్తానని నోట్లకట్టలు ముట్టనివాడు
ఇన్నిటిని కాదని ఇంతకు ఏమిచేశాడు?
ప్రజల హృదయాలనే దోచినాడు
గాంధీ, వినోబా కోవలో తనకో స్థానం సంపాదించుకొన్నాడు.
ప్రజాహితం కోసం అహరహంపాటుపడి
ప్రజాఋషి అని పేర్గాంచినాడు.

# మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన

## (Universal Declaration of Human Rights)

డిసెంబర్ 10, 1948 నాడు ఐక్యరాజ్య సమితి యొక్క సాధారణ సభ మానవ హక్కుల సార్వ లౌకిక ప్రకటనను ఆమోదించి వెల్లడి చేసింది. ఈ చారిత్రాత్మక ఘోషణ యొక్క పూర్తి పాఠాన్ని యిక్కడ పొందు పరుస్తున్నాం.

ఐక్యరాజ్య సమితిలోని సభ్యరాజ్యాలన్నీ రాజకీయ సిద్ధాంతాలతో ప్రమేయం లేకుండా ఈ ప్రకటన పాఠాన్ని విరివిగా ప్రచారం చేయాలని, ప్రదర్శించాలని, చదివించాలని, వెల్లడి చేయాలని ముఖ్యంగా పాఠశాలల్లో యితర విద్యా సంస్థల్లో అందరికీ తెలియజేయాలని ఐక్యరాజ్య సమితి ఆశించింది.



**ప్రస్తావన** (Preamble) :

మానవ కుటుంబంలోని సభ్యులందరికి పుట్టుకతో వారసత్వముతో వచ్చిన గౌరవము, అన్యాక్రాంతం చేయడానికి వీలులేని మానవ హక్కులను గుర్తించుట ప్రపంచమున స్వాతంత్రం, న్యాయం, శాంతుల ప్రతిష్ఠానము జరుగును.

మానవజాతి అంతరాత్మను క్షోభపెట్టిన ఘోర అనాగరిక చర్యలు, మానవ హక్కుల యందు గలిగిన తిరస్కార, ధిక్కార భావముల పరిణామమే వాక్స్వాతంత్ర్యం, విశ్వాసం, ప్రత్యయ స్వాతంత్ర్యములను, భయ విముక్తిని, దారిద్ర్య విముక్తిని మానవులందరు అనుభవించుటకు వీలైన ప్రపంచ ఆవిర్భావమే సామాన్య జనుల యొక్క మహోన్నతమైన ఆకాంక్షగా చాటి చెప్పబడింది.

నిరంకుశపాలనా ప్రజా పీడనములపై గత్యంతరము లేక మానవుడు తిరుగుబాటు చేయవలసిన బలత్కార పరిస్థితులు ఏర్పడకుండా వుండాలంటే మానవ హక్కులు చట్టబద్ధ పరిపాలన చేత పరిరక్షింపబడుట అత్యవసరము.

రాజ్యాల మధ్య సౌహార్ద్ర సంబంధాల వృద్ధికి దోహదపడటం అత్యవసరము.

మౌలిక మానవ హక్కుల యందు, వ్యక్తుల గౌరవ యోగ్యతలయందు, స్త్రీ పురుషులకు గల సమాన హక్కుల యందు, తమకున్న విశ్వాసమును ఐక్యరాజ్య సమితి ఈ ఆజ్ఞా పత్రములో పునరుద్ఘాటించి సామాజిక ప్రగతిని, ఉన్నత జీవిత ప్రమాణములను, విశాల స్వాతంత్ర్యములో పెంపొందించుటకు నిశ్చయించు కొన్నది.

మానవ హక్కుల, మౌలిక స్వాతంత్ర్యముల యెడల శ్రద్ధ చూపుతూ, సార్వలౌకిక గౌరవా భివృద్ధిని ఐక్యరాజ్య సమితి సహకారముతో సాధించుటకు సభ్య రాజ్యములు ప్రతిజ్ఞ చేసినాయి.

ఈ హక్కులు, స్వాతంత్ర్యములను గురించి సర్వసాధారణ అవగాహన, ఈ ప్రతిజ్ఞ సంపూర్ణ సాధనకు అత్యంత ప్రధానము.

అందుచేత, ఇప్పుడు సమాజములోని ప్రతి వ్యక్తీ, సమాజము యొక్క ప్రతి అంగమూ ఈ సార్వత్రిక మానవ హక్కువ ప్రకటనను నిరంతరం మనసులో వుంచుకొని విద్యాబోధలచే మానవహక్కులు, స్వాతంత్ర్యముల యెడల గౌరవమును పెంపొందించుటకు, జాతీయంగా, అంతర్జాతీయంగా, అభ్యుదయ విధానాలను అనుసరించి, సభ్య రాజ్యాలలోని, ప్రజలలో కూడా ఈ హక్కులు, స్వాతంత్ర్యముల పట్ల ఆమోద అంగీకారాలను సాధించవలెను. ఇట్టి ఆశయాలతో సకల మానవులకు, ప్రతి ప్రాంతములోను సమాన ప్రమాణములను పదిలపర్చునదిగా ఈ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను సర్వ సభ్య సమావేశం ఉద్ఘాటిస్తుంది.

**ఆర్టికల్ :1**

గౌరవ ప్రతిపత్తి, హక్కులయందు మానవులందరు పుట్టుకతోనే

స్వతంత్రులు, సమానులు. వారు వివేచనాత్మక సంపన్నులు కనుక పరస్పరము భాతృ స్ఫూర్తితో మెలగవలెను.

**ఆర్టికల్ :2**

ఈ ప్రకటనలో పొందుపరచబడిన హక్కులకు, స్వాతంత్ర్యములకు ప్రతి ఒక్కరికి అధికారము కలదు, జాతి, రంగు, లింగము, భాష, మతము, రాజకీయ లేక యితర అభిప్రాయము, రాజ్యము లేక సామాజిక మూలం, ఆస్తి, పుట్టుక లేక యితర విభేదములకు తావులేదు. మరి యింకా, ఒక వ్యక్తి చెందియున్న రాజకీయ, అధికార పరిధి లేక ఒక దేశ లేక ప్రాంతము యొక్క అంతర్జాతీయ హోదా, స్వతంత్రమా, న్యాసమా, అస్వతంత్ర పాలనమా లేక ఏ యితర సార్వభౌమాధికార ఆధిపత్యమునకు లోబడినదా అన్న తరతమ విభేదములను పాటించబడదు.

**ఆర్టికల్ : 3**

ప్రతి ఒక్కరికి జీవిత రక్షణకు, స్వేచ్ఛకు, వ్యక్తి భద్రతకు హక్కు కలదు.

**ఆర్టికల్ : 4**

ఏ వ్యక్తినీ బానిసతనమునకు, దాస్యమునకులోనుగావింప కూడదు. అన్ని రకముల బానిసత్వం, బానిస వాణిజ్యం నిషేధింపబడవలెను.

**ఆర్టికల్ : 5**

ఏ వ్యక్తిని గాని, క్రూరము, అమానుషము నికృష్టమగు నిరాదరణకు, శిక్షకు గురి చేయకూడదు.

**ఆర్టికల్ : 6**

సర్వత్రా చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందు హక్కు ప్రతి యొక్కరికి వుంది.

**ఆర్టికల్ : 7**

చట్టం ముందు అందరు సమానులు. కనుక ఎటువంటి భేదభావం లేకుండా చట్టము యిచ్చు పరిరక్షణ సమానముగా పొందుటకు అందరికీ అధికారముంది. ఈ ప్రకటనను అతిక్రమించు నెట్టి విభేదం నుండి గాని పరిరక్షింపబడుటకు అందరికీ సమాన హక్కు వుంది.

**ఆర్టికల్ : 8**

రాజ్యాంగము చేత లేక చట్టము చేత ప్రదానం చేయబడిన మౌలిక హక్కులను ఉల్లంఘించిన చర్యల నుండి



**ప్రొ. వాసిరెడ్డి భాస్కరరావు**
**అనువాదకులు**

## జీవిత సంగ్రహం

ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు ఖమ్మం జిల్లా, మధిర మండలం, అల్లీనగరం గ్రామంలో 1940లో జన్మించారు. మధిర, నిజామాబాద్‌లలో హైస్కూల్ విద్య, ఖమ్మంలో కళాశాల విద్య, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎమ్.ఎ., పిహెచ్.డి. చేసారు. ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ, హైద్రాబాద్ ఆర్ట్స్ కాలేజి, వరంగల్‌లో లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్‌గా , లైబ్రరీ ఇన్‌చార్జిగా, యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులుగా, ఫాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్‌గా, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లెర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ రెక్టార్‌గా పనిచేసి 1999లో ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. దాదాపు 100 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. పలు పిహెచ్.డి., ఎమ్.ఫిల్. విద్యార్థుల పరిశోధనకు మార్గదర్శకత్వం వహించారు. దాదాపు 80 పరిశోధనా పత్రాలు, 40 పుస్తకాలను రచించారు. బెర్ముడా, అమెరికా దేశాలలో పర్యటించారు. ఇండియన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేషన్ కార్యదర్శి, కోశాధిపతిగా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, న్యూఢిల్లీ పాలకమండలి సభ్యులుగా, న్యూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యదర్శిగా ఉన్నారు. చార్లీచాప్లిన్ జీవిత చరిత్రను వ్రాసారు. 'గోడలకు నోళ్ళున్నాయ్.', 'మేధ వలస' కవితా సంకలనాలను తెచ్చారు. నోమ్ చామ్‌స్కీ, మాల్కం గాడ్విన్, యల్.రాన్ హబ్బర్డ్ రచనలను అనువదించారు. వరంగల్‌లోని చైతన్య పోస్టు గ్రాడ్యుయేట్ కాలేజి ప్రిన్సిపాల్‌గా, ఎమ్.బి.ఎ. డైరెక్టర్‌గా ఏడు సంవత్సరాలు పనిచేసి, ప్రస్తుతం అదే కాలేజీలో ఆచార్యులుగా వున్నారు.

కాపాడుకొనుటకు సాధికార జాతీయ న్యాయాధికరణ సభ చేత తగిన పరిహారం పొందుటకు ప్రతి వ్యక్తికి హక్కు వుంది.

**ఆర్టికల్ : 9**

ఏ వ్యక్తినీ చట్ట విరుద్ధమైన నిర్బంధనమునకు లేక నిరోధనమునకు, బహిష్కారమునకు గురి చేయకూడదు.

**ఆర్టికల్ : 10**

ప్రతి వ్యక్తికీ అతని హక్కులను బాధ్యతలను నిర్ణయించుటలో మరియు అతని పై దోషారోపణము నందును స్వతంత్రమైన, నిష్పాక్షికమైన న్యాయాధికరణ సభ యెదుట, న్యాయముగా, బహిరంగముగా విచారణను పొందుటకు సమానమైన సమగ్ర హక్కు కలదు.

**ఆర్టికల్ : 11**

1. దండనార్హమైన నేరం ఆరోపింపబడిన ప్రతి వ్యక్తీ, తనను రక్షించుకొనుటకు కావలసిన అభయములన్నిటినీ పొందుతూ చట్టముననుసరించి బహిరంగ విచారణలో నేరస్తునిగా నిరూపింపబడనంత వరకు, నిరపరాధిగా పరిగణింపబడుటకు హక్కును కలిగి వున్నాడు.

2. ఏదో ఒక చర్య ఆచరణగాని లేదా అట్టి ఆచరణలో లోపముగాని జాతీయ అంతర్జాతీయ చట్టముననుసరించి దండనీయమైన నేరముగా, ఆ నేరము జరిగిన కాలములో విధింపబడనట్లయితే, అట్టి నేరమునకు ఎవరును శిక్షార్హులుగా పరిగణింపకూడదు. శిక్షార్హమైన నేరము జరిగిన సమయమున ఆ నేరమునకు విధింపబడిన శిక్షకంటే భారమైన శిక్షను విధింపకూడదు.

**ఆర్టికల్ : 12**

అంతరంగిక, కుటుంబ, గృహలేక ఉత్తర ప్రత్యురాల వ్యవహరములలో చట్ట విరుద్ధమైన జోక్యమునకు లేదా గౌరవ ప్రతిష్టలకు భంగపరచు చర్యలకు ఎవరిని గురిచేయకూడదు. అటువంటి జోక్యము నుండి లేక భంగపరచు చర్యల నుండి చట్టము ద్వారా రక్షింపబడుటకు ప్రతి ఒక్కరికీ హక్కు కలదు.

**ఆర్టికల్ : 13**

1. ప్రతి వ్యక్తికీ ప్రతి రాజ్యము యొక్క హద్దుల లోపల స్వేచ్ఛగా సంచరించుటకు, నివసించుటకు హక్కు కలదు.

2. స్వదేశమును గాని ఏ యితర దేశమును గాని వదిలి వెళ్ళి పోవుటకు, స్వదేశమునకు తిరిగివచ్చుటకు ప్రతివానికి హక్కు కలదు.

**ఆర్టికల్ : 14**

1. పీడన నుండి రక్షణాశ్రయము యితర దేశములలో పొందుటకు, అనుభవించుటకు ప్రతి ఒక్కరికి హక్కు కలదు.

2. రాజకీయాలతో సంబంధంలేని నేరముల నుండి ఉత్పన్నములైనట్టి లేక ఐక్యరాజ్య సమితి ప్రయోజనములకు, సూత్రములకు వ్యతిరేకములైన చర్యల వలన ఉత్పన్నములగు విషయములలో పై హక్కును అర్థించుటకు వీలులేదు.

**ఆర్టికల్ : 15**

1. ప్రతి వ్యక్తికీ ఒక జాతీయతకు హక్కు కలదు.

2. ఏ వ్యక్తినీ చట్ట విరుద్ధముగా తన జాతీయతా భ్రష్టుని చేయరాదు లేదా తన జాతీయత మార్చుకొనుహక్కు లేదనరాదు.

**ఆర్టికల్ : 16**

1. వయోజనులైన స్త్రీ పురుషులందరు, జాతి, జాతీయత లేక మతముల పరిమితత్వము పాటింపక పెళ్ళి చేసుకొనుటకు, కుటుంబము ఏర్పరచుటకు హక్కు కలిగి వున్నారు. పెళ్ళి విషయంలో, పెళ్ళి సమయంలో, విడాకుల సందర్భంలో వారు సమానమైన హక్కులకు అర్హులు.

2. కోరుకొని పెళ్ళి చేసుకోవాలనుకున్న వధూవరులు తమ స్వేచ్ఛాపూర్వక పూర్తి సమ్మతితోనే వివాహ బంధంలో ప్రవేశింపవలయును.

3. కుటుంబము సహజమైన సామాజిక వర్గ మౌలిక విభాగం కనుక అది సమాజము, రాజ్యము చేతను పరిరక్షితమగుటకు అధికారము కలిగి వున్నది.

**ఆర్టికల్ : 17**

1. తాన్కొనిగా లేక యితరులతో కలిసిగాని ఆస్తిని కలిగివుండుటకు ప్రతి వ్యక్తికి హక్కు కలదు.

2. చట్టవిర్ధముగా ఏ ఒక్కని ఆస్తిని మోసగించి తీసుకొనరాదు.

**ఆర్టికల్ : 18**

ప్రతి వ్యక్తికీ భావ స్వాతంత్ర్యం, అంతఃకరణ స్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్య హక్కు కలదు. తన మతమును, విశ్వాసమును మార్చుకొనుటకు, తాన్కొడిగా లేక యితర సామాజిక సభ్యులతో, బహిరంగంగా లేక అంతరంగికముగా తన మతము లేక విశ్వాసములలో బోధ, ఆచరణ, ఆరాధనలు వ్యక్తీకరించు హక్కు దీనిలో యిమిడి వున్నది.

**ఆర్టికల్ : 19**

ప్రతి వ్యక్తికీ అభిప్రాయ వ్యక్తీకరణకు, భావ ప్రకటన

స్వాతంత్ర్యమునకు హక్కు కలదు. జోక్య రహితంగా అభిప్రాయాలను కలిగి వుండే స్వాతంత్ర్యం, హద్దులతో సంబంధం లేకుండా ఏ ప్రసార మాధ్యమం ద్వారానైనా సమాచారమును, భావమును పొందుటకు, కోరుటకు స్వాతంత్ర్యం ఈ హక్కులో యిమిడి వున్నది.

**ఆర్టికల్ : 20**

1. ప్రతివ్యక్తికీ శాంతియుత సమావేశం. సాంగత్యం చేయుటకు స్వాతంత్ర్యం, హక్కుకలదు.

2. ఒక సంఘమునకు చెందాలని ఎవరినీ నిర్బంధించకూడదు.

**ఆర్టికల్ : 21**

1. ప్రతి వ్యక్తికీ, ప్రత్యక్షముగా లేక స్వేచ్ఛగా ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా తన దేశ ప్రభుత్వంలో పాల్గొనుటకు హక్కు కలదు.

2. ప్రతి వ్యక్తికీ తన దేశములోని ప్రభుత్వ ఉద్యోగంలో చేరుటకు సమాన హక్కు కలదు.

3. ప్రభుత్వాధికారమునకు ప్రజాభీష్టమే ఆధారమై వుండవలెను. ఈ అభీష్టము నియతకాలిక నిజమైన ఎన్నికలలో వ్యక్తీకరింపబడవలెను. ఈ ఎన్నికలు సార్వజనీన, సమాన ఎన్నిక హక్కు గలవై, రహస్య ఓటు లేక తత్సమానమైన స్వేచ్ఛాయుత ఓటింగ్ ప్రక్రియ ననుసరించి జరుగవలెను.

**ఆర్టికల్ : 22**

1. ఒక సంఘ సభ్యునిగా ప్రతి ఒక్కరికి సామాజిక భద్రత హక్కు కలదు. దీనిని సాధించుటకు జాతీయ కృషి, అంతర్జాతీయ సహకారము ద్వారా, ప్రతి రాజ్యము యొక్క వ్యవస్థాపన సాధన సామగ్రులననుసరించి, తన గౌరవానికి, తన వ్యక్తిత్వ స్వేచ్ఛాభివృద్ధికి అత్యవసరమైన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల సముపార్జనకు అతనికి అధికారము కలదు.

**ఆర్టికల్ : 23**

1. ప్రతి ఒక్కరికి పని హక్కు వుంది. ఇష్టమొచ్చిన ఉద్యోగము, న్యాయమైన, అనుకూలమైన పని నిబంధనలను, నిరుద్యోగం నుండి పరిరక్షింపబడుటకు హక్కు కలదు.

2. సమానమైన పనికి సమానమైన వేతనము విభేద రహితముగా పొందుటకు ప్రతి ఒక్కరికి హక్కు కలదు.

3. మానవ గౌరవానికి అర్హమైన జీవనమును తనకు, తన కుటుంబానికి హామీనిచ్చే అవసరమైతే యితర సామాజిక పరిరక్షక సాధనములచే పరిపూర్తిని పొందినట్టి, న్యాయనుకూలమైన ప్రతిఫలం పొందుటకు పనిచేయు హక్కు ప్రతి ఒక్కరికి హక్కు కలదు.

4. ప్రతి ఒక్కరికి తన స్వీయ ప్రయోజనార్థము కార్మిక సంఘముల ఏర్పరచుటకు, వాటిలో చేరుటకు హక్కు కలదు.

**ఆర్టికల్ : 24**

ప్రతి ఒక్కరికి విశ్రాంతి, విరామం హక్కు వున్నది సముచిత పరిమితమైన పనిగంటలు, వేతనముతో కూడిన నియత కాలిక సెలవులు దీనిలో చేరి వున్నాయి.

**ఆర్టికల్ : 25**

1. ప్రతి ఒక్కరికి సముచిత ఆరోగ్యంతో కూడిన తన యొక్క తన కుటుంబం యొక్క జీవన ప్రమాణ హక్కు కలదు. దీనిలో ఆహారం, దుస్తులు, నివాసం, ఆరోగ్య మరియు నిరుద్యోగిగా వున్నపుడు సామాజిక భద్రత, అనారోగ్యం, అశక్తత, వైధవ్యం, వృద్ధాప్యం లేక తనవశమునకతీతమైన సందర్భంలో యితరత్రా జీవనోపాధి లోపము నుండి రక్షణ పొందుటకు హక్కు వున్నది.

2. ప్రత్యేక రక్షణ మరియు సహాయం పొందుటకు మాతృత్వము మరియు శైశవమునకు అధికారము కలదు వివాహ సంబంధమున్నా లేకపోయినా పుట్టిన బిడ్డలందరూ సమానమైన సామాజిక పరిరక్షణ అనుభవింతురు.

**ఆర్టికల్ : 26**

1. ప్రతివానికి విద్యా హక్కు వున్నది. కనీసం ప్రాథమిక, మౌలిక దశల యందు ఉచిత విద్య వుండవలెను. ప్రాథమిక విద్య నిర్బంధము కావలెను. సాంకేతిక, వృత్తి విద్య సాధారణంగా అందరికీ దొరికేటట్లుగా వుండాలి, యోగ్యత ఆధారముగా ఉన్నత విద్య అందరికీ సమానముగా అందుబాటులో వుండాలి.

2. మానవ వ్యక్తిత్వ సమగ్రాభివృద్ధికి, మానవహక్కులు, మౌలిక స్వాతంత్ర్యముల గౌరవాన్ని దృఢపరచుటకు విద్యను నిర్దేశించాలి. ఇది అన్ని దేశాల, జాతుల లేక మత సముదాయాల మధ్య అవగాహనను, సహనాన్ని మిత్రత్వాన్ని వృద్ధి చేయాలి. ఐక్యరాజ్యసమితి చేపట్టిన శాంతి నిర్వహణ కార్యక్రమాలకు దోహదం చేయాలి.

3. తమ బిడ్డలకు ఏ విధమైన విద్య అవసరమో ముందుగానే ఎంచుకొనే హక్కు తల్లిదండ్రులకు కలదు.

**ఆర్టికల్ : 27**

1. సమాజము యొక్క సాంస్కృతిక జీవితములో స్వేచ్ఛగా పాల్గొనుటకు శాస్త్రీయ ప్రగతి తత్ఫలితములలో భాగం పంచుకొనుటకు కళా విషయాల ఆనందమును అనుభవించు

హక్కు ప్రతి ఒక్కరికీ కలదు.

2. తన కర్తృత్వముచే సముత్పన్నములైన శాస్త్రీయ, సారస్వత లేక కళాత్మక రచనలచే సిద్ధించిన నైతిక, భౌతిక ప్రయోజనాలను రక్షించుకొను హక్కు ప్రతి ఒక్కరికీ కలదు.

**ఆర్టికల్ : 28**

ఈ ప్రకటనలో పొందుపరచిన హక్కులు, స్వాతంత్ర్యములు సంపూర్ణంగా సిద్ధింపచేయగల ఒక సామాజిక, అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణానికి ప్రతి ఒక్కరికి అధికారం వుంది.

**ఆర్టికల్ : 29**

1. మానవ వ్యక్తిత్వం, స్వేచ్ఛగా, సంపూర్ణంగా వికాసం పొందుటకు సమాజములో మాత్రమే సాధ్యమవుతుంది. కనుక సమాజం పట్ల ప్రతి ఒక్కరికి కర్తవ్యాలు కలవు.

2. తన హక్కులను, స్వాతంత్ర్యాలను సాధించుటలో ప్రతి ఒక్కరు, యితరుల హక్కుల, స్వాతంత్ర్యముల పట్ల తగిన గుర్తింపు, గౌరవములను రక్షించు ఉద్దేశముతో మరియు ప్రజాస్వామిక సమాజంలో నీతి, ప్రజా వ్యవస్థ, సాధారణ సంక్షేమం వంటి న్యాయమైన అవసరాలను సమకూర్చుటకు చట్టముచే నిర్ణయింపబడిన నిబంధనలకు మాత్రమే ప్రతి ఒక్కరు అధీనులుగా వుందురు.

3. ఈ హక్కులు, స్వాతంత్ర్యములు ఐక్యరాజ్య సమితి ఆశయములకు, సూత్రములకు విరుద్ధముగా ప్రయోగింప కూడదు.


**ఆర్టికల్ : 30**

ఈ ప్రకటనలో పొందుపరిచిన ఏ హక్కులను, స్వాతంత్ర్యములనైనా నాశనము చేయుటకు నిర్దిష్టమైన ఏ కార్యక్రమమునైనా లేక ఎట్టి చర్యనైనా నాచరించుటకు ఏ రాజ్యమునకు, వర్గమునకు లేక వ్యక్తికైనా అధికారము కలిగించునదిగా వివక్షితముగా వున్నట్లు ఈ ప్రకటనలో నున్న దేనికీ వ్యాఖ్యానము చేయకూడదు.

## క్లుప్తంగా మానవ హక్కులు అంటే

1. అందరూ సమానులే – సమానత్వ హక్కు 2. వివక్ష కూడదు 3. జీవిత హక్కు 4. బానిసత్వ నిర్మూలన 5. ఎవరినీ చిత్రహింసలు పెట్టరాదు 6. వ్యక్తిగా గుర్తింపు హక్కు 7. సమాన రక్షణ హక్కు 8. న్యాయకస్థానాలచే హక్కుల పరిరక్షణ 9. ఎవరినీ అక్రమంగా నిర్బంధము, బహిష్కారము చేయకూడదు. 10. న్యాయమైన, బహిరంగ విచారణ హక్కు 11. నేరస్తునిగా నిరూపింపబడనంతవరకు నిరపరాధియే. 12. గౌరవ ప్రతిష్టల పరిరక్షణ హక్కు 13. స్వేచ్ఛా సంచరణ హక్కు 14. రక్షణాశ్రయ హక్కు 15. జాతీయత హక్కు 16. స్వేచ్ఛావివాహ, కుటుంబ హక్కు 17. ఆస్తిహక్కు 18. విశ్వాసహక్కు 19. భావ వ్యక్తీకరణ హక్కు 20. సమావేశహక్కు, సంఘహక్కు 21. ప్రజాస్వామ్య హక్కు 22. భద్రతహక్కు 23. పనిహక్కు 24. కార్మిక హక్కులు 25. సహాయం పొందేహక్కు 26. విద్యాహక్కు 27. సాంస్కృతిక హక్కు 28. హక్కుల సాధన యంత్రాంగం ఏర్పాటు 29. సామాజిక బాధ్యత హక్కు 30. ఐక్యరాజ్య సమితి ప్రకటన హక్కులు అందరూ ఆచరించాలి. ◆

# ముళ్లపూడికి జేపీ శ్రద్ధాంజలి



పారిశ్రామిక దిగ్గజం ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ మృతి పట్ల లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

"ఆంధ్రా సుగర్స్‌ను ప్రారంభించి 1947లోనే ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ పారిశ్రామిక పటంలోకి చేర్చిన ఘనత ముళ్లపూడిది. పరిశ్రమలు స్థాపించి, ఉద్యోగావకాశాలను కల్పించి, దేశ సంపదను పెంచే దిశగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అసంఖ్యాకులకు హరిశ్చంద్రప్రసాద్ స్ఫూర్తినిచ్చారు" అని జేపీ నివాళులర్పించారు.

ముళ్లపూడి కుటుంబసభ్యులకు జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

రాష్ట్రంలో పారిశ్రామికీకరణకు శ్రీకారం చుట్టిన శ్రీ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ మృతికి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ తన సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

# లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక

## లోక్‌సత్తా పార్టీ 5 వార్షికోత్సవ సంచిక

2011 అక్టోబరు 2 - లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నాం.

అవినీతిపరుల భరతం పట్టడానికి బలమైన లోక్‌పాల్ చట్టం కోసం సాగిన ఉద్యమం తొలివిజయాన్ని సాధించింది. ఈ ఉద్యమస్ఫూర్తిని మరోమెట్టు ముందుకు తీసుకువెళ్ళాలి. అవినీతికి కేంద్రంగా వున్న రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చెయ్యడానికి అందరూ నడుం బిగించాలి.

సమాజహితం కోసం పనిచెయ్యాల్సిన రాజకీయం పూర్తిగా కలుషితం అయింది. చెడ్డ రాజకీయానికి మంచి రాజకీయమే మందు. దీనికి రాజకీయ వ్యవస్థలని ప్రక్షాళన చెయ్యాలి. ఎన్నికల వ్యవస్థని సంస్కరించాలి. తగిన మంచి వ్యవస్థలను రూపొందించుకోవాలి. అలాగే అంతిమంగా ప్రజలకు మరింత సాధికారతను సాధించాలి.

ఈ మౌలిక అంశాల మీద లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికను అందిస్తున్నాం.

1. రాజకీయ వ్యవస్థల ప్రక్షాళన
   (పార్టీల చట్టం - ఎన్నికల సంస్కరణలు - దామాషా పద్ధతి ఎన్నికలు)

2. ప్రజల సాధికారత
   (స్థానిక ప్రభుత్వాలు - మ్యాక్స్ చట్టం - సహకార సంఘాలు- అర్బన్ బ్యాంకులు)

ఈ ప్రత్యేక సంచికను పై అంశాలపై విశ్లేషణలు, ఉపయుక్త సమాచారంతో చిరకాలంపాటు కరదీపికగా వుండేలా రూపొందిస్తున్నాం.

ఈ ప్రత్యేక సంచిక వెలువరించడానికి మీ తోడ్పాటు ఎంతో అవసరం. మీ సంస్థ తరపున ప్రకటనలు ఇచ్చి సహకారాన్ని అందించాల్సిందిగా కోరుతున్నాం.

మీ ప్రకటనలు 2011 సెప్టెంబర్ 28వ తేదీలోగా అందేలా పంపండి. చెక్కులు, డ్రాఫ్టులు ఈ క్రింది చిరునామాకు పంపండి.

### లోక్‌సత్తా టైమ్స్

**ప్రత్యేక సంచిక ప్రకటన రేట్లు :**

| | బ్లాక్ & వైట్, | మల్టీ కలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | రూ॥ 5000 | రూ॥ 10,000 |
| ప్రత్యేక స్థానాలలో పేజీలు | | రూ॥ 15,000 |
| బ్యాక్ కవర్ పేజీ | | రూ॥ 25,000 |
| పూర్తి పేజీ సైజు | 7″ × 10″ | అంగుళాలు |

### చెక్కులు, డ్రాఫ్టులు

మీరు పంపించే చెక్కులు, డ్రాఫ్టులు
**లోక్‌సత్తా టైమ్స్ హైదరాబాద్,**
పేరుతో తీసుకోవాలి.
(ఎకౌంట్ నం: 62007167836
ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ )

**ఈ క్రింది చిరునామాకు పంపించాలి**

**లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ - 500 004, ఫోన్: 040-2323 1818*

# వామన ప్రస్థానం



బత్తుల వీ.వెం. అప్పారావు

చట్టానికి కళ్ళులేవు
ఫైళ్ళకి కాళ్ళురావు

పావురాన్ని బంధిద్దాం
ఎగరేసి, శాంతి శాంతి అందాం

విత్తు మొలిస్తే పంట
ధర లేకుంటే మంట

చుక్కలకీ పవర్ కట్
పగలు వెలగవు

మార్కెట్‌ది అమ్మకాలు
మతానిది నమ్మకాలు

వీణని మీటితే రాగం
మదిని మీటితే అనురాగం

ఆకాశంలో పిట్ట
రెక్కలే వీసా

పులి అడవికి రాజు
పనివాడు ప్రపంచానికి రాజు

నడక కాళ్ళది
నడత బుద్ధిది

నిజం ఒకటే
వాదనలెన్నో

మనిషి పాత్ర వందేళ్ళు
మట్టిది అనంతం

పెద్దలది భూమి
గెద్దలది ఆకాశం
మనకు గాలి కూడా మిగలదు.

చిరునామా :
జి2 మణిమాల ఎస్టేట్,
151 మోతీనగర్, హైదరాబాద్ - 18
ఫోన్ : 23833798, 23833799

# స్వీకారం

## పాలనలో అవినీతి ప్రక్షాళన

**పోలినేని ఆనందరావు**

రిటైర్డ్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి
జిల్లా ప్రజా పరిషత్, వరంగల్

**ప్రచురణ**

ప్రజాహిత ప్రచురణలు
1-7-454 రెవెన్యూకాలనీ, హనుమకొండ
వరంగల్ - 506001
ఫోన్ 0870 - 2431361
సెల్ : 09390101251
వెల రూ॥ 10/-

## చైతన్యమానవి

**సంపాదకులు : ఎస్. పుణ్యవతి**

రాష్ట్ర కార్యాలయం, బ్లాక్ నెం. 24,
హెచ్ఐజి ఫేజ్ : 2,1-8-1, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ ఫోన్ 27605845
ఫ్యాక్స్ : 040 - 27605845
విరాళం రూ॥ 10/-

## రైతులోకం

**సంపాదకులు : కొల్లి నాగేశ్వరరావు**

**చిరునామా : రైతుభవన్, 210,**
**అమృత ఎస్టేట్స్, హిమాయత్‌నగర్,**
**హైదరాబాద్ - 500 029**

వెల రూ॥ 15/-

# రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం




**బుచ్చిరెడ్డిపాళెం :** రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక గిరిజా థియేటర్లో జరిగిన రైతు సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతు సమస్యలను పరిష్కరిస్తున్నామంటూ ప్రకటనలు చేసే ప్రభుత్వమే వారి ఉత్పత్తులకు మద్దతు ధర లేకుండా మోకాలడ్డుతోందన్నారు. రైతులు మద్దతు ధర కావాలని అడగకుండా, పెంచిన ధరలపై ఉద్యమాలు చేయడం సమంజసం కాదన్నారు. రైతును విస్మరించిన ఏ ప్రభుత్వం. బాగుపడిన దాఖలాలు లేవన్నారు. పండిన ధాన్యాన్ని ఇతరప్రాంతాలకు రవాణా చేయకుండా నాటి ప్రభుత్వం విధించిన ఆంక్షలనే నేటి పాలకులు కొనసాగిస్తున్నారు. ఇక నైనా రైతులు గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసుకొని, స్వతంత్ర్య రైతు సంఘ సమాఖ్య ద్వారా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో సమాఖ్య అధ్యక్షుడు సీఎస్ఆర్ కోటిరెడ్డి, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు నర్రా శ్రీధర్, బెజవాడ ఓబుల్‌రెడ్డి, మురళీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముత్తనపల్లిలో రైతు వేదిక

రొంపిచర్ల మండలంలోని ముత్తనపల్లి గ్రామంలో రైతు వేదిక ఏర్పాటు చేశారు. గ్రామంలోని పాలకేంద్రం సెంటర్లో ఏర్పాటు చేసిన వేదికలో పాల్గొన్న లోక్‌సత్తా పార్టీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈదర గోపీచంద్ మాట్లాడుతూ గ్రామంలో రైతు వేదిక ఏర్పాటు కావటం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్‌నారాయణ నాయకత్వంలో రాష్ట్రస్థాయిలో ఏర్పాటైన స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఆశయాలను రైతులకు గోపీచంద్ వివరించారు. ధాన్యాన్ని రూ॥1500లకు కొనాలని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామరైతులు ఆర్టీసీ బస్సును పునరుద్దరించాలని కోరారు. రైతు వేదిక అధ్యక్షులుగా పరిమి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా అడుసుమిల్లి లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా చిరుమామిళ్ళ రామకృష్ణ ప్రసాద్, కోశాధికారిగా గాడిపర్తి సురేష్, సహాయ కార్యదర్శిగా కటారి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా కసుమూరి మురళి, పద్దెంగుంట శ్రీను, గోరంట్ల బాలకృష్ణ రావెళ్ళ సత్యనారాయణలను ఎన్నుకున్నారు. రాజకీయాలకతీతంగా ఏర్పాటైన ఈ రైతు వేదికలో మిగతా రైతులు కూడా చేరి బలపర్చాల్సిందిగా కార్యదర్శిగా ఎన్నికైన రామకృష్ణ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## రొంపిచర్లలో రైతు వేదిక ఏర్పాటు

**రొంపిచర్ల :** రొంపిచర్లలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో రైతు వేదికను ఏర్పాటు చేశారు. నియోజకర్గంలో 35మంది సభ్యులు చేరగా 11మంది కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈదర గోపీచంద్ ముఖ్యఅతిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో జయప్రకాష్‌నారాయణ్ అధ్యక్షతన ఏర్పడిన స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్యకు అనుబంధంగా నియోజకవర్గ పరిధిలో 10 గ్రామాల్లో రైతు వేదికలు ఏర్పాటు చేశామన్నారు. రొంపిచర్ల రైతు వేదిక అధ్యక్షులుగా సరికొండ నరసింహరాజు. కార్యదర్శి చక్రవరం రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా వీరపల్లి వెంకటేశ్వర్లు సరికొండ చక్రపాణి రాజు, కోశాధికారి ఎన్.పార్థరాజు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# లోక్‌పాల్ - లోకాయుక్తల కోసం ఉద్యమం

**విజయనగరం జిల్లా వార్తలు**

### లక్కవరపు కోటలో

దేశంలో పెచ్చుమీరిపోతున్న అవినీతిని కూకటివేళ్లతో పెకిలించ డానికి బలమైన లోక్‌పాల్ కావాలంటూ నినాదాలతో లక్కవరపుకోట మారు మోగింది. ఇక్కడి ఏపీటిఎఫ్, పీఆర్‌టీయూ మండల శాఖల అధ్యక్షులు గుమ్మడి శ్రీనివాసరావు, రామసన్యాసి రావులు, లోక్‌సత్తా నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దొడ్డి నాగార్జున తదితరుల ఆధ్వర్యంలో అన్నాహజారేకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు.

### అన్నాహజరేకు మద్దతుగా దీక్షలు

**విజయనగరం టౌన్ :** అవినీతి రహిత సమాజం కోసం బలమైన లోక్‌పాల్ బిల్లు వచ్చేంతవరకు ఉద్యమం ఆగదని ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఛాంబర్ ఛైర్మన్ మామిడి అప్పలనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీశెట్టి బాబ్జీ, ఉపాధ్యాయ సంఘం కన్వీనర్ యు.నర్సింహం, రెడ్డిరాజ గోపాల్, టి.సంతోస్ కె.కె.ఎం. రాజు, ఐ. అనంత లక్ష్మీ, ఎం.సుభద్రాదేవి, రాయి పద్మావతి, కె. ఆదినారాయణ, పి. పెంటయ్య, కె.మహేష్, ఎం.రమేష్ పాల్గొన్నారు.

### సంకెళ్ళతో నిరసన

**విజయనగరం టౌన్ :** హజారే అరెస్టుకు నిరసనగా జనలోక్‌పాల్ ఐక్యవేదిక సభ్యులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. బాలాజీ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఏపీ పంచాయితీరాజ్ చాంబర్ చైర్మన్ మామిడి అప్పలనాయుడు, ఏసీటి సంస్థ అధ్యక్షుడు యూఏ నరసింహం, దళిత సంఘనేతలు భానుమూర్తి, వికలాంగ సంఘనేత జె.శ్రీనివాసరావు, ఎం.సుభద్రాదేవి, కోటేశ్వరరావు. గంగులు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం కింద కూర్చుని కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసుకున్నారు.

## లోక్‌సత్తా పార్టీ 5వ వార్షికోత్సవం

## 2011 అక్టోబరు 8, 9 - ఒంగోలు

**అక్టోబరు 8 - ఉదయం 10 గంటలకు**

**లోక్‌సత్తా పార్టీ నాయకత్వ సదస్సు**

- బలమైన లోక్‌పాల్ - ఎన్నికల సంస్కరణలు రాజకీయ సంస్కరణలపై ప్రచార ఉద్యమం
- పౌరుల సాధికారత - బలమైన స్థానిక ప్రభుత్వాలు స్వయం ప్రతిపత్తి గల సహకార సంఘాలు
- రాష్ట్ర రాజకీయ పరిస్థితి పై తీర్మానం
- రాష్ట్రంలో ప్రజా సమస్యలు - తీర్మానాలు
- సంస్థాగత విస్తరణకు కార్యచరణ ప్రణాళిక
- అనుబంధ ప్రజాసంఘాల కార్యకలాపాలు

**సా॥ 4 గం॥** : ప్రజా ప్రదర్శన

5-00 : **బహిరంగ సభ**

**అక్టోబరు 9 :**

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశం

ఉదయం 10గం॥ : నాయకత్వ సదస్సుతీర్మానాలు - కార్యాచరణ ప్రణాళిక

**నాయకత్వ సదస్సుకు ఆహ్వానితులు**

- అందరు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
- అందరు జిల్లా కార్యవర్గ సభ్యులు
- అందరు పట్టణ, మండల కార్యవర్గ సభ్యులు గ్రామ, వార్డు స్థాయి ఆఫీసు బేరర్లు
- అన్ని అనుబంధ ప్రజాసంఘాల - రాష్ట్ర, జిల్లా, పట్టణ మండల ఆఫీసు బేరర్లు
- ఆసక్తి గల ఆహ్వానితులు

# అవినీతి లేని పాలన 'లోక్‌సత్తా'కే సాధ్యం




**విజయనగరం :** అవినీతి లేని పరిపాలన ప్రజలకు అందాలంటే దేశంలో, రాష్ట్రంలో కేవలం లోక్‌సత్తా పార్టీ వల్లే సాధ్యమవుతుందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అవినీతికి వ్యతిరేకంగా ప్రత్యేకంగా ఎజెండా తయారుచేసి ప్రజలముందుకు వచ్చిన పార్టీగా లోక్‌సత్తాకు గుర్తింపు లభించిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిమారుతి మాట్లాడుతూ అవినీతి వ్యతిరేక పోరులో యువత భాగస్వాములు కావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ లక్ష్మీనారాయణ, రవికుమార్, లక్ష్మనాయుడు, దేవర ఈశ్వరరావు అనంతలక్ష్మి పి.వి.రమణతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## ఇది మరో స్వతంత్ర పోరాటం

**విజయనగరంటౌన్ :** రాష్ట్రంలో అవినీతి రోజురోజుకీ హెచ్చుమీరుతోందని అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా మరో స్వాతంత్ర పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని 1942 క్విట్ ఇండియా స్వాతంత్ర్య పోరాటయోధుడు వసుమూర్తి వెంకట సుబ్బారావు పిలుపునిచ్చారు. బలమైన లోక్‌పాల్ కావాలని లోక్‌సత్తా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణకు ఆయన మద్దతు తెలిపారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వీవి సుబ్బారావు వంటి మహానుభావులు విజయనగరం పట్టణంలో వుండడం మన అదృష్టమన్నారు.

## యువతకే అవినీతిని అడ్డుకునే శక్తి వుంది

**విజయనగరం :** దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని అడ్డుకునే శక్తి కేవలం యువతకు మాత్రమే ఉందని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఎం.ఆర్.పి.జి కళాశాల విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బాబ్జీ మాట్లాడుతూ ప్రజల సంపదను రాజకీయాల పేరుతో అక్రమంగా దోపిడీ చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.రమణ, ప్రసాద్, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## లోక్‌పాల్ కోసం బాన్స్‌వాడలో ప్రచారం

అవినీతి మీద మీటింగ్ తేది 20-08-2011 నాడు లోక్‌సత్తా పార్టీ బాన్స్‌వాడ నియోజకవర్గం ఇన్‌ఛార్జీ గీతామూర్తి ఆధ్వర్యంలో మూడంచెల లోక్‌పాల్ బిల్లు గురించి ప్రచారం చేయడం జరిగింది. ఇందులో రైతునాయకులు వర్ని మాజీ సర్పంచ్ బుజ్జిగార్లు, జనవిజ్ఞాన వేదిక నుండి రాంబాబు, రాజ్‌కుమార్, ఉపాధిహామీ పథకం సంబంధించిన ఉద్యోగి శివప్రసాద్‌గారు లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు దాడ్లశేఖర్, చంద్రశేఖర్ వెంకటేశ్వరరావు, మహేష్, మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు ఎ.కె.లత పాల్గొన్నారు. స్థానికంగా ఒక మండలంలో టి.ఆర్.ఎస్., బిజేపి కూడా తమ మద్ధతు తెలిపారు.



**విజయనగరం జిల్లా వెల్దూరులో పవర్ ప్లాంట్ వద్దే వద్దు**

పూసపాటిరేగ మండలం వెల్దూరు గ్రామంలో నిర్మించనున్న కార్వీ పవర్ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ తొమ్మిది గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. వెల్దూరుతోపాటు కోనాడ, నందిగాం, నడిపల్లి, బూరపేట, తిప్పలవలస గ్రామాలకు చెందిన వందలాది మంది కదిలి వచ్చారు. చిన్నా, పెద్దా.. ముసలి... ముతకా అనే భేదం లేకుండా పవర్ ప్లాంటును వ్యతికిస్తూ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. పవర్ ప్లాంట్‌కు అనుమతి వద్దంటూ నినాదాలు చేశారు. లోక్‌సత్తా, సీపీఐ, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. విజయనగరం పట్టణంలోని పోలీస్ మైదానం వద్ద నుంచి వారంతా ర్యాలీగా బయలుదేరి, కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మత్స్యకారులు వేటను సైతం మానుకొని పెద్ద సంఖ్యలో ఆందోళన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి. కామేశ్వరరావు మాట్లాడుతూ రైతులు, మత్స్యకారులు జీవన ప్రమాణాలను దెబ్బతీసే పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక వేత్తల ఒత్తిడికి తలొగ్గి వ్యవసాయ భూములను ప్రాజెక్టులకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచించడం నీతిమాలిన చర్యగా పేర్కొన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలకు భూములుకట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. థర్మల్ ప్లాంటులతో ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికీ తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిసినప్పటికీ వాటి నిర్మాణానికి మొగ్గు చూపడం దుర్మార్గమన్నారు. పచ్చని భూముల్లో ప్లాంట్ నిర్మించాలనుకోవడం సమంజసం కాదన్నారు. దీనివల్ల వేలాది ఎకరాల పంట భూములు బీడువారే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ వేత్తలు, నిపుణులు వద్దని వారిస్తున్నా ప్రభుత్వం వినడం లేదని, దీన్ని చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మించబోమని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారంతా ‘ ప్రాణాలు తీసే పవర్‌ప్లాంట్ వద్దు... మా బతుకులు బుగ్గి చేసే ప్లాంట్ వద్దని మా భూములను బీడుగా మార్చొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టర్ బయటకు వచ్చి, తమ సమస్యలు వినాలని డిమాండ్ చేశారు. దీంతో కలెక్టర్ వీరబ్రహ్మయ్య వారి నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకుడు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర యువసత్తాకి నూతన నాయకత్వ బృందం

**అధ్యక్షుడు శివాజీ రాజు**

**ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు**

**ప్రధాన కార్యదర్శి దోసపాటి రాము**

లోక్‌సత్తా పార్టీ యువజన విభాగం ‘యువసత్తా’ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పొత్తూరి శివాజీ రాజును నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఉత్తర్వు జారీ చేశారు. యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పంచాది రాంబాబును, ప్రధాన కార్యదర్శిగా దోసపాటి రామును నియమించారు. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న ముగ్గురూ వివిధ స్థాయిల్లో పార్టీకి అనుబంధంగా విద్యార్థి, యువజన కార్యక్రమాలలో పనిచేస్తూ సేవలందిస్తున్నారు.

రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో యువసత్తా కమిటీలను ఏర్పాటు చేసి, యువతను పెద్దసంఖ్యలో క్రియాశీల కార్యకర్తలుగా నమోదుచేయటం, యువత సమస్యలపై కార్యక్రమాలను చేపట్టటం, కొత్త రాజకీయ సంస్కృతిని పటిష్టం చేసేందుకు యువతను రాజకీయాల్లో చురుకైన భాగస్వాములుగా చేయటం మీద ప్రధానంగా దృష్టి పెట్టాలని, ఇందుకోసం అన్ని స్థాయిల్లో లోక్‌సత్తా పార్టీతో, ఇతర అనుబంధ సంస్థలతో కలిసి పనిచేయాలని యువసత్తా కొత్త బృందాన్ని జయప్రకాష్ నారాయణ్ కోరారు.

# బలమైన లోక్‌పాల్ కోసం ఖమ్మంలో దీక్షలు




**గాంధీచౌక్ :** బలమైన లోక్‌పాల్ కోసం లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో దీక్షాశిబిరాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.రవి మారుత్ దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకు లోకాయుక్త, స్థానిక ప్రభుత్వాలకు అంబుడ్స్‌మెన్‌ను నియమించాలని కోరారు. ఈ దీక్షాల శిబిరంలో పాల్గొన్న వారికి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏపూరి వెంకటేశ్వరరావు, వినియోగదారుల సంఘం అధ్యక్షులు కే.పిచ్చయ్య, రైతుసత్తా నాయకులు డాక్టర్ రాఘవులు, గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షులు ఏస్వీ నారాయణ, శ్రీరక్ష హాస్పిటల్ ఎండీ. డాక్టర్ వెంకటేశ్వరరావు, బీసి సంఘం నాయకులు వరప్రసాదరావు, నాయిబ్రహ్మణ సంఘం నాయకులు చంద్రమౌళిలు మద్దతు ప్రకటించి ప్రసంగించారు.

ఈ దీక్షా శిబిరంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జూపల్లి సత్యనారాయణ, చింతల లింగేశ్వరరావు, సర్వజన సత్తా జిల్లా అధ్యక్షులు కొర్లకంటి బాలస్వామి, యువసత్తా జిల్లా అధ్యక్షులు ఎల్.పుల్లారావు, సర్వజన సత్తా జిల్లా నాయకులు ఎస్.కె.రహీం, యువసత్తా నాయకులు బానోతు భద్రునాయక్, భానుప్రసాద్, విద్యార్థి సత్తా నాయకులు బంది పార్థసారధి, కొల్లి విజయభాస్కర్, నాయకులు మహేష్, అనిల్‌కుమార్, పీఎస్ఎన్ఎల్. ప్రసాద్, వంగూరి రమేష్, మహంకాళి, సందేశ్‌గుప్తా పాల్గొన్నారు.

## అవినీతిపై ఒకే చట్టం ఉండాలి

**ఖమ్మం మామిళ్లగూడెం :** అవినీతిని నిర్మూలించాలనీ, దేశం మొత్తానికీ ఒకే చట్టం అమల్లో ఉండాలని కోరుతూ విద్యార్థిసత్తా ప్రతినిధులు ఖమ్మం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సత్తా కార్యాలయం నుంచి జడ్పీ కూడలి, వైరా రోడ్డు, బస్టాండ్ మీదుగా మయూరి కూడలి వరకు కొనసాగింది. నాయకులు బంది పార్థసారధి, బయ్య క్రాంతి, గండి నాగరాజ్, దుర్గాప్రసాద్, రమేష్, శేఖర్, పరుశురాములు, వెంకట్, ప్రసాద్ పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా

## మూడంచెల జన లోక్‌పాల్ అవసరం

**చిత్తూరు రూరల్ :** చిత్తూరులో విలేకరుల సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్ రావు మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు దేశవ్యాప్తంగా మూడంచెల పటిష్టమైన చట్టం రావాలని డిమాండ్ చేశారు.

దేశంలో సంస్కరణలను రాజకీయ పార్టీల నుంచే మొదలుపెట్టాలని, పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం వుండాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్టులు పెట్టి, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు, అధికారాలు ఇస్తే దేశంలో కొంత వరకు అవినీతిని అరికట్టవచ్చన్నారు. లోక్‌సత్తా కన్వీనర్ జయకుమార్, ఉపాధ్యక్షుడు కె.మాధవన్, రైతు నాయకులు చెంగల్రాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్సరావు పేటలో పార్టీ కార్యకలాపాలు

## బెల్టుషాపును తొలగించాలి

మండలంలోని అల్లూరివారి పాలెం రోడ్డు రాజునగర్ సమీపంలో దాబా ఏర్పాటు చేసి గత నాలుగు రోజులుగా మద్యం విక్రయిస్తున్నారు. సమీపంలో నివాస గృహాలు, పాఠశాలలున్నాయి. మద్యం సేవించి రాత్రి ద్విచక్ర వాహనంతో మహిళను ఢీకొట్టించటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపాన ప్రియుల ఆగడాలు అధిక మయ్యాయని, బెల్టు దుకాణాన్ని ఎత్తి వేయాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎక్సైజ్ సీఐ వెంకటేష్ నేహత మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకుడు గోపిచంద్, టీడీపీ నాయకుడు పెద్దిరెడ్డి, స్థానికులు వున్నారు.

## స్వతంత్ర రైతు వేదికల ఏర్పాటు

నరసరావు పేట మండలంలోని పమిడిమర్రు, యల్లమంద గ్రామాల్లో స్వతంత్ర రైతు వేదికలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ నాయకులు గోపీచంద్ మట్లాడుతూ పమిడిమర్రు గ్రామంలో శ్రీనివాస్ అధ్యక్షతన రైతువేదిక ఏర్పాటైందన్నారు. కమిటీకి మోహనరావు, సింగయ్య, యల్లమంద, రామయ్య, ఏడుకొండలు కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారని తెలిపారు. అదేవిధంగా యల్లమంద గ్రామ రైతు వేదిక కమిటీకి సాంబశివరావు, కాశీవిశ్వనాథం, హనుమంతరావు, శ్రీనివాసరావు, బాపయ్య, తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

# బలమైన లోక్‌పాల్ కోసం శ్రీకాకుళం లో కార్యక్రమాలు

**ఇచ్ఛాపురం :** లోక్‌పాల్‌బిల్లు అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కటారి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఆర్‌టీసి కాంప్లెక్స్ నుంచి డేఅండ్‌నైట్ కూడలి వరకు యువసత్తా విద్యార్థి సత్తా ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. అవినీతిని దేశం నుంచి తరిమి కొట్టేందుకు లోక్‌సత్తా అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించిన సవరణలు, అన్నాహజారే డిమాండ్‌ను కేంద్రం అంగీకరించడం అభినందనీయమని రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జి అన్నారు. చట్టం వచ్చిందని సంబరపడిపోతే సరికాదని, అవినీతిపై ప్రజలు, యువతరం నిరంతర నిఘా అవసరమన్నారు. ఎన్నికల విధానంలో కూడా మార్పు రావాలని, ఓటుకు నోటు విధానం పోవాలని కోరారు. ప్రజాచైతన్యంతోనే సాధ్య మన్నారు. అన్నాహజారే, లోక్‌సత్తా సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న లోక్‌పాల్ బిల్లుతో ప్రజాస్వామ్యంలో అవినీతిని అరికట్టగలమనే విశ్వాసం పెంచిందని లోకసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ విష్ణుమూర్తి అన్నారు. ఈ సందర్భంగా డేఅండ్‌నైట్ జంక్షన్‌లో మానవహారం నిర్మించి స్వీట్లు పంచారు. యువసత్తా రాష్ట్ర కార్యదర్శి పంచాది రాంబాబు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు కె.పోలినాయుడు, మామిడి సత్యనారాయణ, ఎ.నాగేశ్వరరావు, జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు ఎ.వసంతలక్ష్మి, జగదీష్ పాల్గొన్నారు.





నర్సరావుపేటలో సంతకాల సేకరణ



బలమైన లోక్‌పాల్ కోసం నర్సరావుపేటలో దీక్షలు



బలమైన లోక్‌పాల్ కోసం విజయనగరంలో ప్రదర్శన



వాషింగ్టన్ డి.సిలో పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా ప్రతినిధులతో
మహిళాసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. మహాలక్ష్మి

# విద్యార్థులతో డా॥ జయప్రకాష్ నారాయణ్



RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



వెల్దూరులో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు నిరసనగా
విజయనగరం లో ప్రదర్శన

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad